నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ | బుధవారం 24-2-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 175 | పేజీలు: 4 | వెల: రూ.1/-

పెట్రో ధరలు మరింత దూకుడు

వాటా తగ్గించుకుని పన్నులు సడలిస్తున్న రాష్ట్రాలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): రోజువారీ రేట్లతో పెట్రోల్, డీజిల్ ధరల వాతలు తప్పడం లేదు. ధరల పెరుగుదల ఇప్పట్లో ఆగేలా కనిపించడం లేదు. ప్రభుత్వం తీరు కూడా పెట్రో ధరలను అదుపు చేయాలన్న రీతిలో లేదు. రెండ్రోజులు కాస్త విరామం ఇచ్చినట్టే ఇచ్చి, మళ్లీ సోమవారం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచేశారు. ఢిల్లీలో లీటరు పెట్రోలు 25 పైసలు, డీజిల్ 35 పైసలు పెరిగింది. తాజా పెంపుతో, దేశ రాజధానిలో లీటర్ పెట్రోల్ ధర రూ.90.83కు, డీజిల్ రూ.81.32కు చేరింది.

ఈ ఒక్క నెలలోనే పెట్రోల్ ధర లీటరు రూ.4.63, డిజిల్ రూ4.94 పెరిగింది. మెట్రో పాలిటన్ సిటీల్లోనూ ఇంధన ధరలు చుక్కలను అంటుతున్నాయి. కోల్‌కతాలో లీటర్ పెట్రోల్ రూ.91.12, డీజిల్ రూ.84.20గా ఉంది. ముంబైలో పెట్రోలు రూ.97.35 కాగా, డీజిల్ రూ.88.44. చెన్నైలో పెట్రోల్ రూ.92.90కి చేరగా, డీజిల్ రూ.86.31కి చేరింది. గురుగావ్‌లో పెట్రోల్ రూ.88.54, డీజిల్ రూ.81.55గా ఉంది. నొయిడాలో పెట్రోల్ రూ.88.92 కాగా, డీజిల్ రూ.81.41కి చేరింది. బెంగళూరులో లీటర్ పెట్రోల్ ధర రూ.93.61కి చేరుకోగా, డీజిల్ రూ.85.84గా ఉంది.

అప్రతిహతంగా పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్ ధరలపై వినియోగదారుల నుంచి నిరసలు వెల్లువెత్తు తుండటంతో పశ్చిమబెంగాల్, రాజస్థాన్, అసోం, మేఘాలయ రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలపై స్వల్పంగా పన్నులు సడలించారు. రాజస్థాన్‌లోని కాంగ్రెస్ సారథ్యంలోని అశోక్ గెహ్లోట్ ప్రభుత్వం ఇంధనంపై వ్యాట్‌ను 38 నుంచి 36కు తగ్గించింది. పశ్చిమబెంగాల్ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూపాయి చొప్పున తగ్గించింది. ఎన్నికలకు సిద్ధమవుతున్న అసోంలో పెట్రోల్, డీజిల్‌పై పన్నును లీటరుకు రూ.5కు తగ్గించింది. మేఘాలయ ప్రభుత్వం మరికొంత ఊరట కలిగించింది. పెట్రోల్ ధరను రూ.7.4 చొప్పున, డీజిల్ ధరను రూ.7.1 చొప్పున తగ్గించింది. ఇంధనంపై వ్యాట్‌ను 31.62 శాతం నుంచి 20 శాతానికి తగ్గించింది. నాగాలాండ్ ప్రభుత్వం పెట్రోల్, ఇతర మోటార్ స్పిరిట్లపై పన్నును 29.80 శాతం నుంచి 25 శాతానికి తగ్గించింది. పెట్రోలు మూల ధర 33.60 రూపాయిలు కాగా, హైదరాబాద్‌లో దానిపై కేంద్రపన్ను దాదాపు మూలధరతో సమానంగా 32.90, రాష్ట్రపన్ను 23.43 ఉన్నాయి. కేంద్రం విధించే ఎక్సైజ్‌సుంకం 32.90లో కేవలం బేసిక్ ఎక్సైజ్ సుంకం రూపాయి నలభై పైసలు మాత్రమే. బేసిక్ ఎక్సైజ్ సుంకంలో మాత్రమే రాష్ట్రాలకు 42 శాతం వాటా లభిస్తుంది. తక్కినదంతా కేంద్రం చేతికే వెడుతుంది.

పొరుగు రాష్ట్రాల్లో మళ్లీ కరోనా విజృంభణ

ఆందోళనలో సరిహద్దు జిల్లాల ప్రజలు

హైదరాబాద్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): పొరుగు రాష్ట్రాల్లో మరోమారు కరోనా విజృంభించడంతో తెలంగాణ ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. కరీంనగర్ తదితర ప్రాంతాల్లో మళ్లీ కేసులు పెరుగుతున్న తీరుతో ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు కనపడుతోంది. అయితే చుట్టుపక్క రాష్ట్రాల్లో కరోనా విజృంభిస్తుంటే.. సరిహద్దుల్లో అప్రమత్తం చేయకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని అంటున్నారు. గత ఏడాది కరోనా మొదటిసారి వచ్చినప్పుడు కూడా ఇలాగే అవగాహనా రాహిత్యాన్ని, నిర్లక్ష్యాన్ని ప్రదర్శించి తెలంగాణ ప్రభుత్వం విమర్శలకు గురైంది. వందలాది ప్రాణాలు పోవడానికి కారణమయ్యారంటూ ప్రజలు ప్రభుత్వాన్ని దోషిగా చూశారు. మళ్లీ ఇప్పుడు సయితం ప్రభుత్వం అలాగే వ్యవహరిస్తోంది. మహారాష్ట్ర, కర్నాటక, చత్తీస్‌గఢ్ మూడు రాష్ట్రాల్లో కరోనా కేసులు పెరిగాయి. ఈ మూడు తెలంగాణ సరిహద్దుల్లో ఉన్నాయి. అయినా సరిహద్దుల్లో వచ్చేవారిని ఆపి పరీక్షలు చేయడం లాంటి చర్యలు చేపట్టడంలేదు. చెక్ పోస్టుల దగ్గర టెస్టులు చేయడంలేదు. అయితే టెస్టుల సంఖ్య పెంచాలని ఆదేశాలు మాత్రం జారీ చేసింది. వీలైనంత త్వరగా వ్యాక్సిన్ అందరికీ అందేలా చూడాలని మంత్రి ఈటెల రాజేందర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు ప్రాక్టికల్‌గా సరిహద్దుల్లో మాత్రం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. చెక్ పాయింట్లు పెట్టి పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నారు.

ఇండియా వ్యాక్సిన్లకు పెరుగుతున్న డిమాండ్

ఆరోగ్య రంగంలో మన సామర్థ్యంపై ప్రపంచానికి విశ్వాసం
ఐఐటి అంటే ఇండియన్ ఇండీజినస్ టెక్నాలజీ
ఖరగ్‌పూర్ ఐఐటి స్నాతకోత్సవంలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): కరోనా కట్టడికి మేడిన్ ఇండియా వ్యాక్సిన్లకు పెరుగుతున్న డిమాండ్‌ను మనం అధిగమించాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కరోనా వైరస్ మహమ్మారి తరహాలో భవిష్యత్‌లో పలు సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రపంచం సిద్ధంగా ఉండాలని చెప్పారు. ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో చేపట్టిన చర్యల అమలుపై ప్రధాని మోదీ మంగళవారం ఓ వెబినార్‌లో మాట్లాడారు. కరోనా అనంతరం ఆరోగ్య రంగంలో మన సామర్థ్యం పట్ల ప్రపంచానికి విశ్వాసం ఇనుమడించిందని పేర్కొన్నారు.ప్రస్తుతం ఆరోగ్య రంగానికి అసాధారణంగా బడ్జెట్ కేటాయింపులుండటం ఈ రంగం పట్ల మన నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. రాబోయే రోజుల్లో కొవిడ్-19 వంటి పలు సవాళ్లను ఎదుర్కొనేలా కరోనా వైరస్ మనకు ఓ గుణపాఠం నేర్పిందని చెప్పారు. వైద్య పరికరాల నుంచి మందుల వరకూ, వెంటిలేటర్ల నుంచి వ్యాక్సిన్ల వరకూ..శాస్త్రీయ పరిశోధనల నుంచి ఆరోగ్య మౌలిక సదుపాయాల వరకూ భారత్ భవిష్యత్‌లో ఎలాంటి ఆరోగ్య ఎమర్జెన్సీనైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉందని అన్నారు. ఇకపోతే ఐఐటీ ఖరగ్‌పూర్ 66వ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన విద్యార్థులను ఉద్దేశిస్తూ ప్రసంగించారు. 21వ శతాబ్దంలో భారత్ చాలా మారిందన్నారు. ఐఐటీ అంటే ఇండియన్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మాత్రమే కాదు అని, అవి ఇన్స్‌టిట్యూట్స్ ఆఫ్ ఇండీజీనస్ టెక్నాలజీలుగా మారాలని అని మోదీ అభిప్రాయపడ్డారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, అవగాహన, నిస్వార్థం ఉండాలన్నారు. ప్రస్తుత పరిస్థితిపై దృష్టి పెట్టి, భవిష్యత్తుకు అవసరమైన రీతిలో తయారుకావాలన్నారు. పదేళ్ల తర్వాత అవసరం వచ్చే అంశాలను ఆవిష్కరించాలన్నారు. సమస్యలను అర్థం చేసుకుంటే.. దీర్ఘకాలిక పరిష్కారాలు దొరుకుతాయన్నారు. అర్థం చేసుకునే తత్వం వల్లే.. కొత్త ఆవిష్కరణలు జరుగుతాయన్నారు. వైఫల్యాలే శాస్త్రవేత్తలకు కొత్త దారులు కల్పించాయని, విజయానికి అవే బాటలు వేశాయన్నారు. 21వ శతాబ్దంలో భారత్ ఆశయాలు, అవసరాలు మారినట్లు ఆయన వెల్లడించారు. ఐఐటీ ఖరగ్‌పూర్‌లోని డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసర్చ్ సెంటర్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమం జరగనుంది. విద్యాశాఖ సహకారంతో ఈ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేశామన్నారు. భారతదేశ భవిష్యత్తు కోసం సైన్స్ రంగంలో పెట్టుబడులు పెట్టమంటూ మోదీ చెప్పిన మాటలను ప్రేరణగా తీసుకునే డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. సాంకేతికతకు, ఆరోగ్య సంరక్షణకు మధ్య అనుసంధానంగా ఈ ఆసుపత్రి పనిచేస్తుందని అధికారులు చెప్పారు.

గుజరాత్ పారిశ్రామిక వాడలో పేలుడు

పేలుడు ధాటికి పరుగులు తీసిన ప్రజలు
ప్రమాదంలో 24మందికి తీవ్ర గాయాలు

అహ్మదాబాద్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): గుజరాత్ భరూచ్ జిల్లా జగదీయ పారిశ్రామికవాడలోనూ పేలుడు సంభవించింది. అక్కడున్న కెమికల్ ఫ్యాక్టరీలో పేలుడు సంభవించడంతో 24 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు.

15 ఫైరింజన్లతో మంటలను ఆర్పేశారు. పేలుడు ధాటికి ప్రజలు పరుగులు తీసారు. గుజరాత్‌లోని భరూచ్ జిల్లాలో ఈరోజు పెను ప్రమాదం సంభవించింది. ఝగడియాలోని జీఐడీసీలో గల రసాయన కర్మాగారం యూపీఎల్-5 ప్లాంట్ పెద్ద పేలుగు సంభవించడంతోపాటు అగ్ని కీలలు ఎగసిపడ్డాయి. ఈ ఘటనలో 24 మంది తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. తెల్లవారు జామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపకదళం వాహనాలతో సహా సంఘటనా స్థలానికి చేరుకుంది. మంటలను అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నాలు కొనసాగాయి. ప్రమాదం జరిగనప్పుడు వచ్చిన శబ్దం 15 కిలోమీటర్ల దూరం వరకూ వినిపించింది. దీంతో స్థానికులంతా భూకంపం వచ్చినట్లు ఉలిక్కిపడ్డారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. మీడియాకు అందిన సమాచారం ప్రకారం యూపీఎల్ కంపెనీలో సంభవించిన పేలుడు ధాటికి సమీపంలోని గ్రామాల్లోని కొన్ని ఇళ్ల కిటికీల అద్దాలు విరిగిపడ్డాయి. గత ఏడాది కూడా ఇదే ప్రాంతంలోని పటేల్ గ్రూప్ కెమికల్ ఫ్యాక్టరీలో ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 10 మంది మృతి చెందారు.

నేటినుంచి 6,7,8 విద్యార్థులకు స్కూళ్లు

కరోనా నిబంధనలు పాటిస్తూ తెరిచేలా ఆదేశాలు
మార్చి 1 వరకు ప్రారంభించుకునే వెసలుబాటు
ఆదేశాలు ఇచ్చిన విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): ఇప్పటికే 9,10 తరగతులను ప్రారంభించిన ప్రభుత్వం రాష్ట్రంలో 6,7,8 తరగతులకు కూడా బడులు ప్రారంభం కానున్నాయి. తెలంగాణలో నేటి నుంచి 6, 7, 8 తరగతులు ప్రారంభం కానున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. అయితే నేటి నుంచి మార్చి ఒకటవ తేదీ వరకు ఎప్పుడైనా తరగతులను ప్రారంభించుకోవచ్చని ఆమె మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పాఠశాలల ప్రారంభానికి ఈ మేరకు విద్యాశాఖ అనుమతి ఇచ్చింది. నేటి నుంచి మార్చి 1వ తేదీలోగా తరగతులను ప్రారంభించాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. కరోనా నేపథ్యంలో పాఠశాల నిర్వాహకులు కొవిడ్ మార్గదర్శకాలు విధిగా పాటించాలని సూచించారు. విద్యార్థులు పాఠశాలకు విధిగా హాజరుకావాలన్న నిబంధనేది లేదని, పిల్లలను పాఠశాలలకు పంపేందుకు తల్లిదండ్రుల అనుమతి తప్పని సరని ఆమె పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసు కున్నట్లు వెల్లడించిన ఆమె కోవిడ్ మార్గదర్శక సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని, తల్లిదండ్రుల అనుమతి కూడా తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. కోవిడ్ కారణంగా గత ఏడాది మార్చి చివరి నుంచి విద్యాలయాలు మూతపడ్డాయి. సుదీర్ఘకాలం తర్వాత కాలేజీలు ప్రారంభమై నప్పటికీ పాఠశాలలు మాత్రం తెరుచుకో లేదు. ఇక తెలంగాణలో ఇప్పటికే 9, 10 వ తరగతులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మిగతా తరగతులు చదువుకునే విద్యార్థులకు కూడా బడులు తెరవాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. ఇందులో భాగంగా తాజా 6, 7, 8 తరగతులను ప్రారంభించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే 9,10 తరగతులు ఎలాంటి ఆటంకాలు,ఆందోళనలు లేకుండా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి మిగతా క్లాస్‌లు కూడా ప్రారంభానికి అనుమతుల ఇచ్చారు.

బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకో

మరోమారు విమర్శలు గుప్పించిన బాల్క సుమన్

హైదరాబాద్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని ప్రభుత్వ విప్ బాల్కా సుమన్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై మాట్లాడే ముందు నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. సింగరేణి కార్మికులకు ఆదాయపన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని.. 2014 జూన్ 14న అసెంబ్లీ తీర్మానం చేసిందని.. దీనిపై కేంద్రం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు. తెలంగాణ వచ్చాక సింగరేణిలో 14 వేల ఉద్యోగులు ఇచ్చామని, సిగరేణి లాభాల్లో వాటాను 28 శాతం పెంచామని బాల్కా సుమన్ పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు మేలు చేసే పని చేయకుడా విమర్శలు చేయడం దారుణమని బండి సంజయ్ గుర్తించాలన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

టూవీలర్‌ను ఢీకొన్న టిప్పర్: ఇద్దరు మృతి
కారును డిసిఎం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి

రంగారెడ్డి,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. బండరావిరాల గ్రామం వద్ద వేగంగా వచ్చిన టిప్పర్ అదుపుతప్పి.. టీవీఎస్‌పై వెళ్తున్న ఇద్దరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టీవీఎస్‌పై వెళ్తున్న ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుల నివాసాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఖమ్మం జిల్లాలో డీసీఎం కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని గాయాలైన వ్యక్తిని దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన వెలుగుమట్ల దగ్గర చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాజకీయంగా అంతమొందించే కుట్ర

కేసులతో కెసిఆర్ బెదిరింపులకు దిగుతున్నారు
ఎన్నైనా ఒకేసారి కేసులు పెట్టాలన్న రాజాసింగ్

హైదరాబాద్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): తన రాజకీయ జీవితాన్ని నాశనం చేయాలనే సీఎం కేసీఆర్ కుట్ర చేస్తున్నారన్నారని బీజేపీ ఎమ్మెల్యే రాజసింగ్ ఆరోపించారు. పోలీసు కేసుల తీరు చూస్తుంటే ఇదే అర్థం అవుతోందన్నారు. మంగళవారం రాజాసింగ్ పై అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ఇదే విషయంపై మాట్లాడిన రాజాసింగ్.. తనపై లక్షల్లో కేసులు పెట్టినా భయపడేదిలేదన్నారు. ఎన్ని కేసులు పెట్టినా.. ధర్మం, దేశం గురించి పోరాడుతూనే ఉంటానన్నారు. ఒక్కో కేసు నమోదు చేసే బదులు.. అన్ని కేసులు ఒకేసారి బుక్ చేయాలని సీఎం, హోంమంత్రిని కోరుతున్నానన్నారు. 2018లో పరిపూర్ణానంద ర్యాలీలో పాల్గొన్నానని.. ఆ సమయంలో కేసు బుక్ అయ్యిందని కోర్టుకు రావాలని ఇప్పుడు నోటీస్ ఇచ్చారన్నారు. నేను కేసీఆర్‌ను, హోమ్ మినిస్టర్ ను డీజీపీని అడుగుతున్నా..మొత్తం తెలంగాణలో తనపై ఎన్ని కేసులు ఉన్నాయో చెప్పండని ప్రశ్నించారు. ఇప్పటికే 60 నుంచి 70 కేసులు పెట్టారని..నేనేం భయపడను, కొట్లుడుతా కానీ.. నాపై ఎన్ని కేసులు ఉన్నాయో లెక్క చెప్పండి అన్నారు. ఏయే పోలీస్ స్టేషన్ లో ఎన్ని కేసులు ఉన్నయో చెప్పాలన్నారు. గో రక్షణపై మాట్లాడితే కేసులు పెడుతున్నారని.. దేశం జెండా పట్టుకుంటే కేసులు పెడుతున్నారన్నారు. నేను నా దేశం కోసం, ధర్మం కోసం పని చేస్తూ చనిపోవాలనుకునే వ్యక్తినని రాజాసింగ్ అన్నారు. కేసీఆర్ నీకు చేతులు ఎత్తి దండం పెట్టి అడుగుతున్నా.. నువ్వు పెట్టే కేసులకు భయపడను? గుర్తు పెట్టుకో అన్నారు.

మద్యం యువకుడి దురాగతం

స్కూడ్రైవర్‌తో పొడిచి తల్లి హత్య

న్యూఢిల్లీ,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని ఢిల్లీలో దారుణం జరిగింది. మద్యానికి డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో ఓ యువకుడు కన్నతల్లినే అత్యంత కిరాతకంగా స్క్రూడ్రైవర్‌తో పొడిచి చంపాడు. ఢిల్లీలోని ఖాజురీ ఖాస్ ఏరియాలో ఆది వారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సుశీల్ పాండే (22) అనే యువకుడు తన తల్లి, తండ్రితో కలిసి ఖాజురి ఖాస్ ఏరియాలో నివాసం ఉంటున్నాడు. గతంలో టెక్నీషియన్‌గా పనిచేసిన సుశీల్ మద్యానికి బానిసయ్యాడు. ఆరు నెలల క్రితం చేస్తున్న ఉద్యోగం కూడా పోవడంతో మద్యం కోసం తల్లిదండ్రులను వేధించడం మొదలుపెట్టాడు. ఎప్పటిలాగే ఆదివారం రాత్రి కూడా మద్యానికి డబ్బులు ఇవ్వాలంటూ తల్లితో గొడవకు దిగాడు. అయితే, ఆమె డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించింది. పనీపాటా లేకుండా తాగి తిరిగితే ఇళ్లు ఎలా గడుస్తుందని మందలించింది. దీంతో కోపోద్రిక్తుడైన కొడుకు స్క్రూడ్రైవర్‌తో తల్లిని విచక్షణారహితంగా పొడిచి పారిపోయాడు. ఘటన జరిగిన సమయంలో పక్కింట్లో మాట్లాడేందుకు వెళ్లిన భర్త వచ్చి చూసేసరికి ఆమె రక్తపు మడుగులో విగతజీవిగా పడివుంది. హతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు.

సూరారంలో స్వల్ప అగ్నిప్రమాదం

హైదరాబాద్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): సూరారం కృష్ణానగర్‌లో మంగళవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. కృష్ణానగర్‌లోని జీపీ ఫుడ్స్ పరిశ్రమలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో సిబ్బంది అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చింది. బాయిలర్ నుంచి ఆయిల్ లీక్ కావడంతోనే మంటలు ఎగిసిపడినట్లు జీపీ ఫుడ్స్ సిబ్బంది పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం సంభవించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కూలిన పాత అసెంబ్లీ పైకప్పు

ఆందోళనకు గురైన ఉద్యోగులు
ముప్పు లేదన్న అసెంబ్లీ కార్యదర్శి

హైదరాబాద్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): రాష్ట్ర అసెంబ్లీ పరిసరాల్లో ప్రమాదం తప్పింది. పాత అసెంబ్లీ భవనం తూర్పు వైపు ఎలివేషన్ పెద్ద శబ్దం చేస్తూ కూలింది. ప్రభుత్వ విప్ రేగా కాంతారావు కార్యాలయ భవనం పైకప్పు గోపురం కూలిపోయింది. దీంతో ఆందోళనకు గురైన భద్రతా సిబ్బంది పరుగులు తీశారు. శిథిలాలు గార్డెన్ ఏరియాలో పడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తెలంగాణ అసెంబ్లీకి వందేళ్ల చరిత్ర ఉంది. ఆరో నిజాం మహబూబ్ అలీఖాన్ పాలనలో దీని నిర్మాణం ప్రారంభించారు. 1905లో పనులు ప్రారంభం కాగా.. 1913 డిసెంబర్ నాటికి భవన నిర్మాణం పూర్తయింది. ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ హయాంలో భవనం అందుబాటులోకి వచ్చింది. మొదట్లో దీన్ని 'మహబూబియా టౌన్‌హాల్'గా పిలిచేవారు. తర్వాతి కాలంలో ఇదే అసెంబ్లీ అయ్యింది. ప్రజల చందాలతో ఈ భవనాన్ని నిర్మించడం విశేషం. ఇదిలా ఉంటే, కొత్త సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణాన్ని తెలంగాణ సర్కార్ చేపట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుత సచివాలయ ప్రాంగణంలోనే కొత్త సెక్రటేరియట్, ఎర్రమంజిల్‌లోని రోడ్లు భవనాల శాఖ ఆవరణలో కొత్త అసెంబ్లీ భవనాలను నిర్మిస్తున్నారు. గతేడాది ఈ నిర్మాణాలకు సంబంధించిన భూమి పూజ చేశారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ఇదిలావుంటే తెలంగాణ శాసనసభ పాత భవనం ఘటనపై సభ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహా చార్యులు స్పందించారు. ఏటా గోడలు, సీలింగ్ నుంచి సున్నం, గచ్చు పెచ్చులు జారడం సహజమని పేర్కొన్నారు. అసెంబ్లీ ఇంజనీరింగ్ విభాగం ఆయా ప్రాంతాలను గుర్తించి మరమ్మతులు చేపడతూ ఉందన్నారు. ప్రధాన స్ట్రక్చర్‌లో ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. పటిష్టంగా ఉన్నదని, అధికారులు, ఇంజనీరింగ్ విభాగం నిత్యం శాసనసభ భవనంతో పాటుగా అనుబంధ కార్యాలయాలు ఉన్న భవనాలను పరిశీలిస్తున్నారని చెప్పారు. ఎల్లవేళలా, అప్రమత్తంగా ఉంటూ, అవసరమైన మేరకు మరమ్మతులు చేపడుతున్నామని ఆయన అన్నారు. పాత భవనం నిర్మించి వందేళ్ళకు పైగా అయిందని, అప్పటి టెక్నాలజీ ప్రకారం డంగు సున్నంతో నిర్మించారని చెప్పారు.

శరవేగంగా ఆర్డీఎస్ హెడ్‌వర్క్ పనులు

-మండిపడుతున్న స్థానిక రైతులు

హైదరాబాద్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): ఏపీ, తెలంగాణ మధ్య నీళ్ల పంచాయితీ మళ్లీ మొదలయ్యేలా కనిపిస్తోంది. ఆర్డీఎస్ హెడ్ వర్క్స్ వద్ద ఏపీ కొత్త కాల్వ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించడంతో తెలంగాణ రైతులు మండిపడుతున్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా కుడి కాల్వ నిర్మిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఎన్నోసార్లు అనుమతులు ఇవ్వకుండా అడ్డుకట్ట వేసినా..నిర్మాణాలు సాగుతున్నాయి. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు మాత్రమే సాగునీరు వాడుకునే అవకాశం ఉంది. ఏపీ సర్కార్ విజ్ఞప్తితో నాలుగు టీఎంసీల నీటిని వాడుకొనేందుకు ఏపీకి ట్రిబ్యునల్ అనుమతి ఇచ్చింది. అయితే దీనికి అనేక షరతులు పెట్టింది. ఆర్డీఎస్ దగ్గర నిర్మాణం చేపట్టాలంటే ఎన్నో అనుమతులు తీసుకోవలసి ఉంటుంది. దీంతో పాటు తుంగభద్ర దగ్గర నీటి స్థాయిని కూడా అంచనా వేసుకోవాలి. వీటిని ఏమాత్రం పట్టించుకోకుండా ఏపీ సర్కార్ నిర్మాణం చేపట్టిందని ఆయకట్టు రైతులు మండిపడుతున్నారు.

చరిత్రలో నేటినిజం

కం॥ సామాజిక నివలలో
భీముఆయె వెలగి నట్టి తేజోనిధిపై
ప్రేమాత్ముడై వర్ణించెను
కామనలను 'శారదాముఖర్జీ' పైననే !!

(ఫిబ్రవరి 24 అలనాటి ఆం.ప్ర. గవర్నర్, నేత శ్రీమతి శారద ముఖర్జీ పుట్టినరోజు..)

-రాధశ్రీ
సెల్: 9494481210

"రైతు జీవితం" అంశంపై కవితలకు ఆహ్వానం..

రైతే రాజన్నారు
రైతే దేశానికి వెన్నెముక అన్నారు
రైతు లేనిదే దేశానికి ప్రగతి లేదన్నారు
రైతే అన్నదాత అన్నారు
తినే ప్రతి గింజమీద మనపేరు ఉంటుందని
అలాంటి ప్రతి గింజను పండించే రైతే
పరబ్రహ్మ స్వరూపం అన్నారు
మరి ఈ రోజు రైతు పరిస్థితి ఏమిటి?
ఎండనక, వాననక
నడిరోడ్డుపై నిస్సహాయంగా చూసే పరిస్థితి
ఈరోజు ఎందుకొచ్చింది?
నేలతల్లిని నమ్ముకున్న రైతుకు
పోరాటం ఎందుకు చేయాల్సి వస్తోంది?

మీ కలాలు ఇచ్చే సమాధానం ఏమిటి?

పాతిక వాక్యాలు మించకుండా
రైతు సమస్య పరిష్కార దిశగా
కలాలను కదిలించండి..

'నేటినిజం' దినపత్రిక,
ఎస్.ఆర్.టి-74, జవహర్‌నగర్, హైదరాబాద్-20
లేదా E-mail : netinizam2020@gmail.com
పేజీమేకర్ ఓపెన్‌ఫైల్, అనుస్క్రిప్ట్-7లో డిటిపి చేసి మెయిల్ చేయండి..

ఉత్తమమైన కవితలతో 'నేటినిజం' ప్రత్యేక సంచికను వెలువరిస్తుంది. వెంటనే మీ రచనలు పంపగలరు.

మోడీ తలచుకుంటే దెబ్బలకు కొదవా ?

నేటినిజం
బుధవారం 24-2-2021

రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా ?...కట్టి పడేస్తే ఎన్ని దెబ్బలయినా తింటాడు.. ! ఇలాంటి సామెతలు తెలుగునాట బాగా ప్రాచుర్యం పొందాయి. అంటే రాజు ఏదయినా తలచుకుంటే అది చేస్తాడు. అతడికి ప్రజల బాగోగులు ..వారి కష్ట సుఖాలు పట్టవు...ప్రజలు ఏమైతే మనకేంటని అనుకునే నాయకులు ఉన్నంత వరకు వారు ఆలోచనలు భిన్నంగా ఉంటాయి. ఇప్పుడు ప్రధాని మోడీ తీరు కూడా అలాగే ఉంది. ఏ ముహుర్తాన మోడీ ఢిల్లీలో అడుగు పెట్టాడో కానీ ప్రజలకు రంగుల చిత్రం చూపాడు. బిజెపిని చాపచుట్టేసి తన చంకన పెట్టుకున్నాడు. బిజెపి పెద్దలు అన్న వారు పార్టీలో లేకుండా చేసారు. చాయ్‌వాలా ప్రధాని కాబోతున్నాడని అంతా భ్రమించారు. ప్రజల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తి ప్రధాని అయితే..అది కూడా బిజెపి నుంచి అయితే అంతా మంచే జరుగుతుందని భావించారు. వరుసగా రెండోసారీ పట్టం కట్టారు. కానీ మోడీ చేస్తున్న విన్యాసాలు చూస్తుంటే ..కేవలం గుజరాత్ అండ్ కో అధికారం చెలాయిస్తోంది. గుజరాత్ వ్యాపారులకు మేలు జరిగే నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రజలను పట్టించుకోకుండా తనపని తాను చేసకుంటూ అధికారం నిలుపుకునే ప్రక్రియలో ఆరితేరారు. అధికారాన్ని నిలుపుకోవడానికి ప్రత్యర్థి పార్టీలను పూర్తిగా దెబ్బతీసారు. బ్యాంకులు దివాలా తీసి..వేలకోట్లు ముంచిన వారు విదేశాల్లో హాయిగా సముద్ర తీరాల్లో సేదదీరుతున్నారు. దేశంలో ముంచేవారు ముంచుతున్నారు. బ్యాంకులు ప్రజలను ముంచేలా ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి. మోడీ అధికారంలోకి వచ్చిన ఏడేళ్లలో ప్రజలకు ఫలానా మేలు జరిగిందన్న దాఖలా లేదు. సామాన్యులు..మధ్యతరగతి ప్రజల పరిస్థితి పెనం మీంచి పొయ్యిలో పడ్డట్లు అయ్యింది. ఇకపోతే ఇటీవలి కాలంలో వరుసగా పెరుగుతున్న పెట్రో ధరలతో సామాన్యులు బతకడం ఎలా అన్న భయంలో పడ్డారు. పెట్రో ధరలకు కూడా గత ప్రభుత్వాలను నిందిస్తున్నారు. గతంలో పెట్రో దరలు పెరగ్గానే లెఫ్ట్ పార్టీల నేతలు సహా అంతా రోడ్డెక్కేవారు. ఎడ్లబండ్లు బయలుదేరేవి. కానీ ప్రజలు, పార్టీలు అలసి పోయాయి. మోడీకి ఇది కూడా బాగా కలసి వస్తున్న అంశంగా చూడాలి. పెట్రోధరలు పెరుగుతున్నా తమకేమీ పట్టనట్లుగా ప్రజలు అసహనంగానే జీవితం సాగిస్తున్న తీరు ఆశ్చర్యం కలిగిస్తున్నది. ధరలు పెరగడాన్ని మోడీ, నిర్మలా సీతారామన్ తదితరులు సమర్థించుకుంటున్నారు. మన చేతుల్లో ఏమీ లేదంటున్నారు. విదేవాల నుంచి మనం ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నాం కనుక..ధరలతో పాలకులకు సంబంధం లేదన్న వాదనను బాగా ప్రచారం చేస్తున్నారు. పెట్రోధరల ప్రభావం సమస్త జీవన రంగాలపైనా పడుతున్నా ప్రజలు భరిస్తున్నారు. పెట్రోధరల పెంపు ద్వారా నిత్యవాసర సరుకులు, రవాణా వ్యవస్థలు భారం అవుతున్నా భరించాడం మన విధి అన్న రీతిలో సాగుతున్నారు. మొఘల్స్, బ్రిటిషర్స్ కాలంలో వారు చెప్పిందే వేదం అన్నట్లుగా ఉండేది. అయితే అప్పుడన్నంత నిర్బంధం లేకున్నా ..మోడీ ధోరణి మాత్రం అంతకుమించిన నిరంకుశంగా ఉంటోంది. విమానయాన రంగం కుదేలవుతోంది. పబ్లిక్ రంగస్థలు కుదలవుతున్నాయి. వాహన ఇంధనాల ధరలకు పట్టపగ్గాలు లేకుండా పోవడంతో ప్రజలు ఎంత నిట్టూరు స్తున్నా, ప్రతిపక్షాలు ఎంతగా విమర్శలు గుప్పిస్తున్నా, పెట్రోలు సెంచరీ కొట్టబోతోందన్న ఛలోక్తులు పేలుతున్నా, ధరలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. ఈ విషయమై కేందప్రభుత్వం ఏ మాత్రం మొహమా టపడడం లేదు. ధరలు పెరగడం అన్నది సహజ పరిణామంగా పాలకులు వల్లిస్తున్నారు. అంతేనా అంటే మీ హయాంలో పెంచలేదా అని కిందిస్థాయి నేతలంతా వంతపాడుతున్నారు. సాధారణంగా చమురు ఉత్పత్తుల ధరలు అంతర్జాతీయంగా ముడిచమురు ధరలతో ముడిపడి ఉంటాయి. కానీ, కొన్ని సంవత్సరాలుగా అంతర్జాతీయ ధరలు అతి తక్కువ స్థాయిలో ఉన్నప్పటికీ భారతదేశంలో మాత్రం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. అంటే అంతర్జాతీయ స్థాయి ధరలతో మనకు సంబంధం లేదని రుజువయ్యింది. కరోనాసమయంలో అంతర్ఆజతీయంగా బ్యారెల్ ధరలు తగ్గినా..వినియోగం పడిపోయినా ధరలు మాత్రం దిగి రాలేదు. నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి, పెట్రోలియం ఉత్పత్తుల ద్వారా ప్రత్యేక ఆదాయాన్ని సమకూర్చుకోవడం ఒక విధానంగా మారిందని ఇప్పటికి జనాలకు అర్థం అవుతోంది. దిగుమతి ధరలు తగ్గినప్పటికీ, ఆ తగ్గుదల వినియోగదారులకు చేరకుండా ఆ మేరకు పన్నులను సుంకాలను విధించడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్న వ్యాపార ఎత్తుగడను పాలకులు అవలంబించారు. ఇది కేవలం కేంద్రం విధానమే కాదు..రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పనిలోపనిగా వాతలు పెడుతున్నాయి. ఇప్పుడు అంతర్జాతీయ ధరలు నిలకడగా ఉన్నప్పటికీ, పెట్రోలు, డీజిల్ ధరల పెరుగుదల మనదేశంలో మాత్రం స్వారీ చేస్తున్నాయి. జిఎస్టీని ప్రవేశపెడుతున్న సమయంలో పన్నుల పంపకాలపై విస్తృత చర్చ జరిగింది. రాష్ట్రాలు ఆదాయం కోసం ఎక్కువగా ఆధారపడే వాటిల్లో ..ఒకటి చమురు ఉత్పత్తులు, రెండోది మద్యం. కేంద్రం విధించే ఎక్సైజ్ డ్యూటీకి అదనంగా తాము కూడా సుంకాలు విధించే అవకాశం పెట్రోల్, డీజిల్ విషయంలో ఉన్నది. మద్యం అయితే పూర్తిగా రాష్ట్ర వ్యవహారం. ఈ రెంటిని జిఎస్టి పరిధిలోకి తెస్తే, తమ ఆదాయం తగ్గి ఇబ్బందులు పడతామని రాష్ట్రాలు వాదించాయి. ఫలితంగా, మినహాయింపు పొందిన సరుకులలో పెట్రోలు, డీజిల్, మద్యం చేరాయి. ఇప్పుడు రోజువారీగా జరుగుతున్న పెట్రో ధరల పెంపునకు పరిష్కారం దానిని జిఎస్టి పరిధిలోకి తేవడమేనని కేంద్రం వాది స్తున్నది. జిఎస్టి పరిధిలోకి వస్తే ధరలు ఇంతగా ఉండవన్న వాదన ఉంది. అయితే దీనివల్ల రాష్ట్రాలకు నేరుగా వచ్చే పెట్రో ఆదాయం పోతుంది. కొత్తగా విధించే అవకాశమూ ఉండదు. జిఎస్టి పంపకాలలో భాగంగా పెట్రో జిఎస్టిలో నుంచి కూడా వాటా వస్తుంది. ఆ వాటా తమ ప్రస్తుత ఆదాయం కంటె తప్పనిసరిగా తక్కువగా ఉంటుందని రాష్ట్రాలు వాపోతు న్నాయి. నిజానికి ప్రజలకు ఎలాగయితే ధరలు తగ్గుతాయో అది అవలంబించాలి. ప్రజలను నిట్టనిలువునా దోచుకునే పన్నులు విధానం పోవాలి. ప్రజలు అశక్తులని భావిస్తే వారు శక్తిని కూడగట్టుకుంటే ప్రభుత్వాలే ఉండవని గుర్తుంచుకోవాలి. వారిపై అదేపనిగా ధరలతో దాడి చేయలేమని పాలకులు గుర్తించాలి.

రీజనల్ రింగ్ రోడ్డుకు కేంద్రం అంగీకారం

భూసేకరణ బాధ్యత ఇక త్వరగా చేపట్టాలి
ఇదో గేమ్ ఛేంజర్ కానుందన్న కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డుకు కేంద్ర ప్రభుత్వం సూతప్రాయంగా అంగీకారం తెలిపినట్టు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం కిషన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర భాజపా నేతల బృందం కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసింది. రీజినల్ రింగ్ రోడ్డుకు అన్ని అనుమతులు మంజూరు చేయాలని బృందం గడ్కరీని కోరింది. ఈ మేరకు వినతిపత్రాన్ని అందచేశారు. నంతరం నేతలతో కలిసి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రీజినల్ రింగ్ రోడ్డు అంశంపై గడ్కరీని కలిశామని, రీజినల్ రింగ్ రోడ్డుకు కేంద్రం సూతప్రాయంగా ఆమోదం తెలిపిందని వెల్లడించారు. తెలంగాణ అభివృద్ధిలో ఇదో గేమ్ ఛేంజర్ కానుందని.. ఈ రింగ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పనులను రాష్ట్ర ప్రభుత్వం త్వరగా ప్రారంభించాలని కిషన్‌రెడ్డి కోరారు. తెలంగాణ అభివృద్ధి ముఖ చిత్రాన్ని మార్చే ఈ అపురూప ప్రాజెక్టును కేంద్రం రెండు పార్ట్‌లుగా నిర్వహించ బోతోందన్నారు. రాష్ట్ర ప్రజల తరపున ప్రధాని నరేంద్ర మోదీ, నితిన్ గడ్కరీలకు కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ నగరానికి 50 నుంచి 70 కి.మీల దూరంలో, ఓఆర్ఆర్‌కి 30కి.మీల దూరంలో ఈ రహదారి నిర్మాణం జరగనుంది. సుమారు 20కి పైగా ముఖ్య నగరాలు,పట్టణాలను కలుపుతూ నిర్మాణం జరగనున్న ఈ రహదారితో రాష్ట్రంలోని 40శాతం మంది ప్రజలకు రింగ్ రోడ్డు ఉపయుక్తంగా ఉండ నుందన్నారు. మొదటి దశలో సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు 158 కి.మీల మేర నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. రూ.9,522 కోట్లు నిర్మాణ వ్యయంగా నిర్ణయించారు. రెండో దశలో చౌటుప్పల్ - సంగారెడ్డి మధ్య 182 కి.మీల మేర నిర్మాణం చేపట్టనున్నారు. ఈ రెండు దశల్లో కలిపి సుమారు రూ.17వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. హైదరాబాద్‌కు వచ్చే అన్ని హైవేలను కలుపుతూ ఈ రింగ్ రోడ్డు నిర్మాణం జరగనుంది. రీజినల్ రింగ్ రోడ్డుతో లాజిస్టిక్ పార్కుల అభివృద్ధితో పాటు పెట్టుబడులు కూడా పెరుగుతాయని అన్నారు.

వృక్షవేదం పుస్తకం అద్భుతం

ప్రశంసించిన ఉపరాష్ట్రపతి వెంకయ్య

హైదరాబాద్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): వృక్ష వేదం పుస్తకం చదువుతుంటే నా చిన్నతనంలో మా నానమ్మ, అమ్మమ్మ వాళ్ళతో కలిసి అడవుల్లోకి పోయి వచ్చిన రోజులు గుర్తుకు వస్తున్నాయని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. వృక్ష వేదం పుస్తకాన్ని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడికి రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్ కుమార్ అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అడవులు, ప్రకృతి చిత్రాలు, పురాణాలలో ప్రకృతి గురించి చెప్పిన శ్లోకాలతో ప్రత్యేకంగా రూపొందించిన వృక్ష వేదం పుస్తకాన్ని హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిసి ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడికి సంతోష్ కుమార్ అందజేశారు. పుస్తకం చాలా అద్భుతంగా ఉందని ఈ పకృతి చిత్రాలను చూస్తూ ఉంటే తన చిన్నతనంలో నానమ్మ అమ్మమ్మ వాళ్ళతో కలిసి అడవుల్లోకి పోయి వచ్చిన రోజులు గుర్తుకు వస్తున్నాయి అని పుస్తకాన్ని చూసిన ఉపరాష్ట్రపతి అన్నారు. ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ ప్రకృతికి దూరంగా ఉన్న వారికే వచ్చిందిని, ప్రకృతితో కలిసి జీవించిన వారు కరోనా వైరస్ బారిన పడలేదని ఉపరాష్ట్రపతి అన్నారు.

భీష్మ ఏకాదశి రోజు ముక్తి

(ఆధ్యాత్మికం)



తిరుమల,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): మాఘ శుద్ధ ఏకాదశి, భీష్మ ఏకాదశిగా బ్రహ్మాండ పురాణం, మహాభారతం ద్వారా తెలుస్తోంది. భీష్ముడు మాఘ శుక్ల అష్టమి నాడు తనువుచాలించినా ..వైకుంఠానికి చేరడానికి మూడు రోజులు పట్టింది కావున ఏకాదశి నాడు భీష్ముడు మోక్షాన్ని పొందాడని ప్రసిద్ధి. అందుకే మాఘశుక్ల ఏకాదశి భీష్మ ఏకాదశి అని అంటారు. భీష్మ నిర్యాణానంతరం వచ్చిన ఏకాదశి కనుక ఆయన పేరున ఈ ఏకాదశిని 'భీష్మ ఏకాదశి' అని పిలుస్తారు. 'జయ ఏకాదశి, 'మహ్హోఫల ఏకాదశి' అని కూడా అంటారు. గంగామాత స్త్రీరూపంలో ధరించినపుడు అష్టవసువుల్లో ఆమెకు పుట్టిన ఏడవ కుమారుడే భీష్ముడు. 58 రోజులపాటు అంపశయ్యపై..యుద్ధంలో పదకొండు రోజులు యుద్ధం చేసి, గాయపడి 58 రోజుల పాటు అంపశయ్యపై పడుకొని, దక్షిణాయన కాలంలో మరణించడం ఇష్టం లేక ఉత్తరాయణ పుణ్యకాలం కోసం ఎదురుచూస్తాడు. అలా తన నిర్యాణానికి తనే సమయం నిర్ణయించుకున్న మహాపురుషుడు. ఆ సమయంలో ఆయన్ని చూడటానికి వచ్చిన కృష్ణుని చూసిన అమితానందంతో వేయి నామాలతో కీర్తిస్తాడు. విష్ణుసహస్ర నామాలను పఠిస్తాడు. అలా మాఘశుద్ధ అష్టమినాడు పరమపదిస్తాడు. భారతదేశంలో భీష్మునిది ప్రత్యేక పాత్ర. చిన్ననాటి నుంచే ఆయన త్యాగశీలి. తండ్రి కోసం స్వసుఖాన్ని, రాజ్యాన్ని వదులుకుంటాడు. తండ్రి సుఖం కోసం వారసత్వ హక్కైన రాజ్యాన్ని త్యాగం చేసిన తరువాత భవిష్యత్తులో తన సంతానం ఉల్లంఘిస్తారేమోన న్న అనుమానంతో వివాహాన్నే వద్దనుకున్నాడు. సకల ధర్మములలో ఉత్తమ ధర్మం శ్రీవిష్ణు సహస్రనామాలతో స్తోత్రం చేయడమని భీష్ముడు ధర్మరాజుకు చెప్పెను. అందుకే భీష్మునికి ఇష్టమైన విష్ణు సహస్రనామమును ఈ ఏకాదశి నాడు ఉపవాసముతో మూడు మార్లకు తగ్గకుండా శక్తి మేరకు పారాయణం చేయవలెను. భీష్మ ఏకాదశి సూర్యోదయం నుంచి ద్వాదశి సూర్యోదయం వరకు అఖండ విష్ణు సహస్రనామ పారాయణజరిగితే పరమాత్మ వైకుంఠాన్ని ప్రసాదిస్తారు, మరు జన్మ ఉండదు. ఏకాదశి, ద్వాదశి తిథులలో భీష్మునికి అర్ఘ్యమును తిలతర్పణం చేస్తే మంచిది. మరునాడు అనగా ద్వాదశి నాడు శ్రాద్ధం, అన్నదానం చేసినచో పునర్జ న్మ ఉండదు. జీవితంలో బ్రతికినంత కాలం అన్ని కోరికలు నెరవేరి ఆనందంగా ఉంటారని ప్రతీతి. భీష్మ ఏకాదశినాడు విష్ణుసహస్రనామం పఠిస్తే పుణ్యం కలుగుతుంది అంటారు. అనుకున్న పనులు విఘ్నాలు లేకుండా నెరవేరుతాయని, భోగభాగ్యలు కలిగి, పాపాలు హరిస్తాయి. గ్రహదోషాలు ఉన్నవారు విష్ణుసహస్రనామాన్ని పఠిస్తే విముక్తి కలుగుతుందంటారు. అందుకే భీష్మ ఏకాదశి నాడు విష్ణు సహస్రనామం పారాయణం చేయమని అంటారు.

ప్రజల నాడికి చిక్కని కోమటిరెడ్డి బ్రదర్స్

ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా పాలిటిక్స్
ఎత్తుగడలు అర్థంకాక తలలు పట్టుకుంటున్న ప్రజలు

నల్లగొండ,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): నల్లగొండ జిల్లాలో కోమటిరెడ్డి బ్రదర్స్ రాజకీయాలు ఎవరికీ అర్థం కానంతగా నడుస్తున్నాయి. తొలినాళ్లలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి టిఆర్ఎస్‌లో చేరుతారన్న ప్రచారం సాగింది. అది సద్దు మణిగాక ఇప్పుడు పిసిసి పదవి కోసం ఆయన తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సాగర్ ఉప ఎన్నిక పేరుతో కాంగ్రెస్ తాత్కాలికంగా దానిని పక్కన పెట్టింది. ఇటీవలే మరో అడుగు ముందుకు వేస్తూ తమ్ముడు రాజగోపాల్ రెడ్డి బిజెపిలో చేరుతానంటూ ప్రకటనలు చేశారు. ఇక సాగర్ ఉప ఎన్నికలో రాజగోపాల్‌రెడ్డిని బిజెపి అభ్యర్థిగా నిలుపుతారన్న ప్రచారం సాగింది. మొత్తంగా ఏం జరుగుతోంది. రాజకీయాలు ఎటు పోతున్నాయి. అన్నదమ్ముల వ్యవహార శైలి అర్థం కాక ప్రజలు జట్టు పీక్కుంటున్నారు.

రాజకీయాలు ఎప్పుడూ అనూహ్యంగానే ఉంటాయని చెప్పడానికి వీరిద్దరి తీరే నిదర్శనంగా చూడాలి. అందులో కాంగ్రెస్ పాలిటిక్స్ మరీ గమ్మత్తుగా ఉంటాయి. ఒకే కుటుంబంలో రెండు పార్టీలు, రెండు వర్గాలుగా చీలిపోయి ఉంటారు. ఎవరి ఎజెండా వారిదిగా కాంగ్రెస్ పాలిటిక్స్ నడుస్తాయి. అన్న, తమ్ముడి జెండాలు, ఎజెండాలు వేర్వేరుగా ఉంటాయి. ప్రత్యేకించి తెలంగాణ కాంగ్రెస్‌లో పాలిటిక్స్ చూస్తుంటే ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ఉన్నాయి. బయటకు అంతా కలిసే ఉన్నామని భ్రమలు కల్పిస్తూనే ఎవరికి వారు కత్తులు నూరుతుంటారు. ఎవరి రాజకీయం వాళ్లదే అన్నచందంగా ఇప్పుడు కాంగ్రెస్ నడుస్తోంది. కాంగ్రెస్ లో ఇలాంటి పాలిటిక్స్ ప్రజలకు కూడా తెలుసు. తెలంగాణ కాంగ్రెస్ లో కీలక పదవుల్లో ఉన్న వారి ఇంట్లో పంచాయితీ మరీ గమ్మత్తుగా ఉంటుంది. చూసే వాళ్లని ఆశ్చర్యానికి కూడా గురిచేస్తుంది. తెలంగాణ కాంగ్రెస్ లో కోమటిరెడ్డి బ్రదర్స్ వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

కోమటిరెడ్డి బ్రదర్స్ అంటే ఓ బ్రాండ్. కానీ, ఇప్పుడు ఈ ఇద్దరూ చెరో దారి అన్నట్టు ఉంటున్నారు. పీసీసీ చీఫ్ పదవి కోసం కోమటిరెడ్డి వెంకటరెడ్డి సీరియస్ గా ప్రయత్నం చేస్తుంటే, రాజగోపాల్ రెడ్డి తిరుపతిలో నేనైతే బీజేపీకి వెళ్లా అంటూ కామెంట్స్ చేశారు. సోదరుడి పీసీసీ చీఫ్ ప్రయత్నాలు పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడంతో... ఇద్దరి మధ్య గ్యాప్ ఉందా? లేక అన్నో పార్టీ...తమ్ముడు ఇంకో పార్టీ అనే వ్యూహం ఎంచుకున్నారా? అనే టాక్ నడిచింది. లేకపోతే అన్నకు పదవి ఇవ్వకుంటే తమ్ముడితో పాటు అన్నకూడా పోతాడన్న భ్రమ కల్పించడానికా అన్నది కూడా అర్థం కాదు. ఇప్పటికైతే ఇద్దరూ చెరోదారి అనే రీతిలోనే వ్యవహారం నడిపిస్తున్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాదయాత్ర చేస్తా అని ఇటీవలే ప్రకటించారు. అయితే పోలీసులు అనుమతి 25 మందికే ఇవ్వడంతో... పాదయాత్ర వాయిదా వేసుకున్నారని అంటున్నారు.. పాదయాత్ర పై కూడా రాజగోపాల్ రెడ్డి మాట్లైనా మాట్లాడలేదు. కోమటిరెడ్డి వెంకట రెడ్డి పాదయాత్ర చేస్తే రాజగోపాల్ వచ్చే వారో.. లేదో అని టాక్ కూడా యాత్ర కు ముందే స్టార్ట్ అయ్యింది. అన్నదమ్ముల దారులు వేరు కావటం, అన్నకి ఓ అజెండా... తమ్ముడికి మరో అజెండా ఉండటంతో ఇద్దరి జెండాలు వేరు కావటంలో తప్పు లేదని ప్రజలు కూడా సర్దుకుంటున్నారు. అయితే ఇందులో ఏ వైకరయినా స్పష్టత లేకపోవడంతో ప్రజలకు చికాకు కన్పిస్తోంది.

ఆర్థికంగా రాష్ట్రాలను దెబ్బతీసే కుట్ర

ప్రాంతీయ పార్టీలకు పొగపెడుతున్న మోడీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానాన్ని ప్రవేశపెట్టాలనే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వాల కాలం నుంచే మొదలయ్యింది. యూపిఏ హయాంలో జిఎస్టీ తీసుకుని రావాలన్న నిర్ణయాన్ని ప్రస్తుత బిజెపి పాలకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రస్తు ప్రధాని మోడీ కూడా గుజరాత్ సిఎం హోదాలో తీవ్రంగా వ్యతిరేకించారు. ఒకేరకమైన పన్ను విధానంతో రకరకాల పన్నులు పోయిన ఒకటే ఉంటుందని వాదించారు.

మోడీ వచ్చాక జిఎస్టీని పట్టుబట్టి అమలు చేయడంతో కేంద్రం పక్కా వ్యాపార ధోరణితో ప్రజల నుంచి ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తోంది. వివిధ దేశాలలో ఒకే రకమయిన పన్ను విధానం ఉండడం ప్రపంచీకరణకు అనుకూల వాతావరణాన్ని కలిగిస్తుందన్న భావనతో, పన్ను సంస్కరణలు మొదలయ్యాయి. కానీ అమెరికా వంటి దేశంలో కూడా జిఎస్టికి చుక్కెదురయింది. అక్కడ వారికి ఒకే విధానం కంటె, రాష్ట్రాల ప్రతిపత్తే ముఖ్యం అన్న విధాంలో ఉన్నారు. దీర్ఘకాలం జిఎస్టి పై జరిగిన చర్చలలో రాష్ట్రాల హక్కులకు హాని కలుగకుండా సంస్కరణను ఎట్లా సాధ్యం చేయాలన్న అంశంపై వాదోపవాదాలు జరిగాయి. కొత్త విధానంలోకి మారిన వెంటనే కలిగే నష్టానికి పరిహారం చెల్లిస్తామని కేంద్రం వాగ్దానం చేసింది. జిఎస్టి విధానం అమలు మొదలైన తరువాత, కరోనా ఇబ్బందుల కాలంలోనూ పన్ను వాటా ఆదాయం గణనీ యంగా తగ్గిపోయిన సందర్భంలో పరిహారం ఇవ్వడానికి కేంద్రం ఎన్నో మెలికలు పెట్టింది. చివరకు కొంత ఇచ్చింది కానీ, ఇవ్వవలసినంత మాత్రం ఇవ్వలేదు. రాష్ట్రాలను ఇబ్బంది పెట్టడానికి ఆర్థిక కేటాయింపులను వాడడంలో ప్రస్తుత కేందప్రభుత్వం రాజకీయ వ్యూహం చూపుతున్నది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రతిపక్ష రాష్ట్రాల విషయంలో నిధుల కేటాయింపులు, అనుమతుల విషయంలో పక్షపాతం చూపడం, దానికి ప్రతిస్పందనగానే ప్రాంతీయ పార్టీలు ఆవిర్భవించడం జరిగింది. బిజెపి ప్రభుత్వం, తీవ్రజాతీయత సహాయంతో ప్రాంతీయ శక్తులను బలహీనపరచడానికి, రాష్ట్రాలను పరాధీనం చేయడానికి ప్రయత్నిస్తున్నది. ఒకే దేశం, ఒకే పన్ను, ఒకే పరీక్ష, చివరకు ఒకే ఎన్నికల దాకా పరిస్థితి వెడుతున్నది. జిఎస్టి పరిహారం సందర్భంలో, తాము కోరుతున్న సంస్కరణలను అమలు చేయడాన్ని ఒక షరతుగా పెట్టడం చూశాం. మొత్తం ఆదాయం కేంద్రం నుంచి మాత్రమే రావలసివస్తే, ఇక రాష్ట్రాలకు సొంత విధానాలు అంటూ ఏమీ మిగలవు. తాజాగా అలాంటి పరిస్థితులు కల్పిస్తున్నారు. రాష్ట్రాలను ఆర్థికగంఆ దెబ్బతీయడం ద్వారా అక్కడ పాగా వేయాలన్నది మోడీ నేతృత్వంలోరి బిజెపి ప్లాన్‌గా ఉంది. ప్రజల్లో ప్రాంతీయ పార్టీలను చులకన చేసి లేదా మరో రకంగా అధికారం కబ్జా చేయాలని చూస్తున్నారు.

కాంగ్రెస్‌కు పాల్వాయి హరీష్ గుడ్‌బై

టిఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బిజెపియే అన్న కూన

హైదరాబాద్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ పార్టీకి షాకుల మీద షాకులు తగులుతున్నాయి. కుమరం భీం జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగలనుంది. సిర్పూర్ కాగజ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పాల్వాయి హరీశ్‌బాబు తన అనుచరులతో కలిసి జేపీలో చేరనున్నారు. సిర్పూర్‌కు పెద్ద దిక్కుగా హరీశ్ వ్యవహరిస్తు న్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. ఈ విషయం ఇలావుంటే కాంగ్రెస్ పార్టీ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ పాల్వాయి హరీష్ బాబును బహిష్కరించారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు హరీష్‌ను బహిష్కరిస్తునట్లు క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి హరీష్ పోటీ చేశారు. ఈ నెల 23న బీజేపీలో పాల్వాయి హరీష్ చేరనున్నారు. ఇదిలావుంటే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన కూన శ్రీశైలం గౌడ్.. తాజాగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో.. ఆ పార్టీ కండువా కప్పుకున్న సంగతి తెలిసిందే.. అయితే, బీజేపీతో చేరడానికి గల కారణాలపై మాట్లాడుతూ తెలంగాణలో అధికార టీఆర్ఎస్ పార్టీకి బలమైన ప్రత్యామ్నాయం భారతీయ జనతా పార్టీయేనని విశ్వాసంతోనే తాను బీజేపీలో చేరానన్నారు.. గ్రూప్ తగాదాలతో సతమతమవుతోన్న కాంగ్రెస్ పార్టీ... అధికార టీఆర్ఎస్ పార్టీకి ఏ మాత్రం ప్రత్యామ్నాయం కాదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన ఆయన... కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నారన్నారు.. అందుకే తాను బీజేపీలో చేరానని క్లారిటీ ఇచ్చారు. జాతీయ పార్టీ అయిన బీజేపీ ద్వారా ప్రజలకు అనేక విధాలుగా సేవ చేసే అవకాశం కూడా లభిస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఇక, బీసీలకు బీజేపీ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న అంశం కూడా తన నిర్ణయానికి మరో కారణంగా చెప్పుకొచ్చారు.

సామాన్యుడి సంక్షేమానికి కెసిఆర్ పెద్దపీట

వ్యవసాయరంగంలో తిరుగులేని ఆధిక్యం
బిజెపి చేసిందేమిటో చెప్పాలన్న మంత్రి పువ్వాడ

ఖమ్మం,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ పాలనలో వ్యవసాయం బాగుందని మంత్రి పువ్వాడ అజయ్ అన్నారు. తెలంగాణను కోటిఎకరాల మాగాణిగా తీర్చిదిద్దాలని సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, సీఎం అద్భుత పాలనతో దేశానికే రోల్ మోడల్‌గా నిలిచారన్నారు. అనేక సంక్షేమకార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని అన్నారు. రైతుల అభివృద్ధి కోసం రూ. 50 వేల కోట్లకు పైగా కేటాయించడం గొప్ప విషయమని, తద్వారా రైతుల ఆత్మహత్యలు, ఆకలి చావులు నిర్మూలించగలిగామని అజయ్ అన్నారు. వ్యవసాయాన్ని పండగలా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని, తెలంగాణ ఏర్పడితే కరెంట్ ఉండదని సమైక్య పాలకులు భయపెట్టారని, సీఎం కేసీఆర్ కృషితో 24 గంటల నిరంతర నాణ్యమైన కరెంట్ అందివ్వగలుగుతున్నామని అన్నారు. టీఎన్ఐపాస్ ద్వారా ఐటీ రంగంలో మెరుగైన ప్రగతిని సాధించు కున్నామని తెలిపారు. హైదరాబాద్‌ను దేశంలోనే సురక్షితమైన నగరంగా తీర్చిదిద్దామన్నారు. విమర్శలు చేస్తున్న బిజెపి నేతలు కేంద్రం ఏం చేసిందో చెప్పాలన్నారు. పెట్రో దరలు పెంచడం తప్ప చేసిందేమీ లేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోమారు పల్లా రాజేశ్వర్ రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. పేదల సంక్షేమం కోసం ప్రతి ఏటా రూ. 40వేల కోట్లు కేటాయింపులు చేసినట్లు తెలిపారు. వృద్ధాప్య పెన్షన్ అర్హత 65 ఏళ్ల నుంచి 57 ఏళ్లకు తగ్గింపు చేయడం జరిగిందని, ఒంటరి మహిళలు, దివ్యాంగుల, వితంతువుల పెన్షన్లు రెట్టింపు చేశామన్నారు. రైతులకు ఏడాదికి రూ. 8వేల పంట పెట్టుబడి ఇస్తున్నామని, అభివృద్ధి సంక్షేమంలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందన్నారు. కుల,

నెలాఖరుకు సభ్యత్వ నమోదు పూర్తి కావాలి

–పార్టీ శ్రేణులకు కెటిఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): ఈ నెలాఖరు నాటికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేసే విధంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జిలతో వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు, మెంబర్షిప్ డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని సైతం సమాంతరంగా కొనసాగించాలని ఇన్‌ఛార్జిలకు కేటీఆర్ సూచించారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం విస్తృతంగా కొనసాగుతోందని అన్నారు. పార్టీ నిర్ణయించుకున్న లక్ష్యాన్ని మించి సభ్యత్వ నమోదు విజయవంతం కాబోతున్నదని చెప్పారు. ఈ సందర్భంగా కేటీఆర్ పార్టీ సభ్యత్వ నమోదు పైన జిల్లాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని పార్టీ నాయకులు కేటీఆర్‌కు తెలిపారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో నిర్దేశిత లక్ష్యాన్ని మించి సభ్యత్వ నమోదు కొనసాగుతున్న విషయాన్ని పార్టీ నేతలు కేటీఆర్‌కు వివరించారు. పార్టీ సభ్యత్వ నమోదులో పార్టీ శ్రేణులంతా కలిసి సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కేటీఆర్ సూచించారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతున్న తీరుపైన మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.

మరోమారు కరోనా విజృంభణతో ప్రభుత్వం అప్రమత్తం

–మహారాష్ట్ర సరిహద్దు జిల్లాల అధికారులను హెచ్చరించిన మంత్రి

హైదరాబాద్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ):సరిహద్దు రాష్ట్రాల్లో కరోనా కేసులు అనూహ్యంగా పెరగడంపై తెలంగాణ వైద్యారోగ్యశాఖను మంత్రి ఈటల రాజేందర్ అప్రమత్తం చేశారు. మహారాష్ట్రకు సరిహద్దులో ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే వ్యాక్సిన్‌ను మార్కెట్‌లో అందుబాటులోకి తేవాలని కోరారు. 50ఏండ్లు దాటిన దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి త్వరగా వ్యాక్సిన్ ఇవ్వాలని అన్నారు. 'కర్ణాటక, ఛత్తీస్‌గఢ్‌లో కరోనా కేసులు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో కొత్త కేసులు పెరగకుండా కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టాం. రాష్ట్రంలో కొవిడ్ పరీక్షలు పెంచుతాం. గాంధీ, టిమ్స్, నిమ్స్‌లో మళ్లీ పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రస్తుతానికి కేసులు భారీగా పెరిగిన దాఖలాలు లేవు. ప్రస్తుతానికి కర్ఫ్యూపై ఎలాంటి ఆలోచన లేదు. కరోనా ఉన్నంతకాలం ప్రజలు జాగ్రత్తగా ఉండాలని' మంత్రి సూచించారు. ఇదిలావుంటే కరీంనగర్ జిల్లాలో మరోసారి కరోనా లక్షణాలు బయటపడడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కరీంనగర్ నగర శివారు గ్రామాల్లో కరోనా బయట పడడంతో ఆయా గ్రామాల్లో భయం నెలకొంది. దుర్శేడు, చేగుర్తిలో కరోనా కేసులు పెరుగుతున్నాయి. చేగుర్తిలో 35 కరోనా కేసులు బయటపడ్డాయి. దీంతో గ్రామంలో పూర్తిగా లాక్ డౌన్ విధించారు. గ్రామస్తులందరికి వైద్య పరీక్షలు కొనసాగుతున్నాయి. దుర్శేడులో కొత్తగా నాలుగు కేసులు నమోదయ్యాయి. పాఠశాలకు వెళ్తున్న విద్యార్థుల్లో భయం నెలకొంది.

పోచారం సహా పలువురికి సమన్లు

హైదరాబాద్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ప్రజా ప్రతినిధుల కోర్టు సమన్లు జారీ చేసింది. 2005లో వరంగల్‌లోని సుబేదారి పీఎస్ పరిధిలో టీడీపీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. దీంతో ఆందోళన నిర్వహించిన పోచారం సహ పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఆందోళన కేసులో పోచారం సహ పలువురికి కోర్టు సమన్లు జారీ చేసింది. వరంగల్ కోర్టు నుంచి ఇటీవల ప్రజా ప్రతినిధుల కోర్టుకు కేసు బదిలీ అయింది. నాటి టీడీపీ నేతలు ఎర్రబెల్లి దయాకర్, దేవేందర్‌గౌడ్, కడియం శ్రీహరికి కోర్టు సమన్లు జారీ చేసింది. అలాగే ఎస్.వేణుగోపాలచారి, మండవ వెంకటేశ్వరరావు, నరేందర్‌రెడ్డికి కూడా కోర్టు సమన్లు జారీ చేసింది. మార్చి 4న కోర్టుకు హాజరుకావాలని వారిని ప్రజా ప్రతినిధుల కోర్టు ఆదేశించింది.

బోధన్ పాస్‌పోర్టు కేసులో 8మంది అరెస్ట్

–విచారణను వేగవంతం చేసినట్లు సిపి సజ్జన్నార్ వెల్లడి

హైదరాబాద్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): బోధన్ పాస్‌పోర్ట్ కేసులో విచారణ వేగవంతం చేసినట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. ఈ కేసులో భాగంగా ఇప్పటివరకు 8 మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. వీరిలో ఇద్దరు పోలీస్ అధికారులు కూడా ఉన్నారు. నలుగురు బంగ్లాదేశీయులు, ఒకరు పశ్చిమబెంగాల్, ఒకరు ఏజెంట్, ఇద్దరు స్పెషల్ బ్రాంచ్ అధికారులను అరెస్ట్ చేసినట్లు వివరించారు. ఒకే చిరునామాస్‌పై 32 పాస్‌పోర్టులు జారీ అవడం కలకలం రేపింది. దీనిలో ఇప్పటివరకు 72 పాస్ట్‌పోర్టులు గుర్తించినట్లు వివరించారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఒకే చిరునామాపై భారీ సంఖ్యలో పాస్‌పోర్టులు ఉండడంపై ఇప్పటికే ఇమ్మిగ్రేషన్, రీజనల్ పాస్‌పోర్టు అధికారులకు సమాచారం ఇచ్చినట్లు సజ్జనార్ తెలిపారు. ఎంతమంది దేశం దాటి వెళ్లారనేది విచారణ చేస్తున్నట్లు చెప్పారు. అధికారులు, స్థానికుల పాత్రపైనా కూడా విచారణ చేస్తున్నట్లు వివరించారు. త్వరలోనే మిగతా వారిని అదుపులోకి తీసుకుంటామని పోలీస్ అధికారులు చెబుతున్నారు. నకిలీ పత్రాలతో పాస్ పోర్ట్ పొందారని, ఎంతమంది దేశం దాటి వెళ్లారు, ఎంతమంది పాస్‌పోర్టులు పొందారనేది విచారణ చేస్తున్నట్లు సీపీ వెల్లడించారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కస్టడీకి తీసుకొని విచారిస్తామని పేర్కొన్నారు. పాస్‌పోర్ట్ పరిశీలనలో లోపాలపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. దోషులు ఎవరైనా పదిలేది లేదని స్పష్టం చేశారు.

షర్మిల పార్టీకి తొలి సమన్వయకర్త నియామకం

హైదరాబాద్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): తెలంగాణలో తాను పెట్టబోయే పార్టీకి షర్మిల తొలి నియామకం చేశారు. తన కార్యక్రమాల సమన్వయకర్తగా వాడుక రాజగోపాల్‌ను షర్మిల నియమించింది. జూబ్లీహిల్స్ నియోజక వర్గానికి చెందిన రాజగోపాల్ వైఎస్ కుటుంబానికి 30 ఏళ్లుగా పరిచయం. తెలంగాణలో పార్టీ పెట్టే దిశగా షర్మిల వేగంగా అడుగులు వేస్తున్నారు. దీనిలో భాగంగా తనకు నమ్మకస్తులైన వారిని షర్మిల తన పార్టీకి సలహాదారులుగా నియమించుకుంటున్నారు. తెలంగాణలో అన్ని జిల్లాల నుంచి కార్యకర్తలతో పాటు సంఘాల నేతలు, మాజీ ఐఏఎస్, ఐపీఎస్‌లతో షర్మిల లోటస్ పాండ్‌లో సమావేశాలు జరుపుతున్నారు.

బిసి సంక్షేమంపై మంత్రి గంగుల సమీక్ష

హైదరాబాద్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): వెనకబడిన తరగతుల సంక్షేమం, పౌర సరఫరాల శాఖలకు సంబంధించిన అంశాలపై బీసి సంక్షేమం, పౌరసరఫరాల శాఖా మంత్రి గంగుల కమలాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌తో కలిసి సోమవారం బి.ఆర్.కె.ఆర్ భవన్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీసి ఆత్మ గౌరవ భవనాల నిర్మాణం, సమాఖ్యలు, వెనకబడిన తరగతుల వర్గాలకు స్వయం ఉపాధి పథకాలపై చర్చించారు. చౌక ధరల దుకాణాలు, ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియాకు సంబంధించిన విషయాలపై సమీక్షించారు. వీటిని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బి.వెంకటేశం , పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్ కుమార్, బీసి గురుకులాల కార్యదర్శి మల్లయ్య బట్టు, బి.సి. కో–ఆపరేటివ్స్ ÷నాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆలోక్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థిపై దాడి కేసులో భారీ జరిమానా

–విద్యార్థి కుటుంబానికి అందచేసిన యాజమాన్యం

హైదరాబాద్,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): తెలంగాణలోని ఓ విద్యార్థిని గాయపర్చిన ప్రైవేటు పాఠశాల యాజమాన్యానికి వినియోగదారుల సేవా కేంద్రం భారీ జరిమానా విధించింది. ఆ మొత్తాన్ని బాధిత విద్యార్థికి అందేలా చర్యలు తీసుకుంది. మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కృపాకర్‌ను గతేడాది మార్చి 3న హాస్టల్ వార్డెన్ దండించాడు. కర్రతో కొట్టగా విద్యార్థి కుడి కన్నుకు తీవ్ర గాయమై చూపుకోల్పోయాడు. బాధిత విద్యార్థి తండ్రిపాఠశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో ఆయన తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సేవా కేంద్రాన్ని ఆశ్రయించారు. పాఠశాల యాజమాన్యాన్ని, బాధిత విద్యార్థిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చిన సేవా కేంద్రం అధికారులు.. నష్టపరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. పాఠశాల యాజమాన్యం ఇచ్చిన రూ.11.50లక్షల చెక్కును విద్యార్థి కృపాకర్‌కు తెలంగాణ పౌరసరఫరాల శాఖ కమిషనర్ అందజేశారు.

తెగిపడ్డ హైటెన్షన్ వైర్లు

తల్లీ కొడుకు అక్కడికక్కడే మృతి

అనంపతురం,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): విద్యుత్ తీగలు తెగిన పడిన ఘటనలో తల్లీకొడుకు సజీవ దహనమయ్యారు. ఈ విషాదకర ఘటన అనంతపురం జిల్లాలోని పెద్దపప్పూరు మండలం వరదపాయ పల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. వెంకటస్వామి (37) తల్లి వెంకటలక్ష్మమ్మ (55)తో కలిసి కూలీ పని కోసం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో ఒక్కసారిగా విద్యుత్ హైటెన్షన్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో మంటలు చెలరేగి తల్లీకొడుకులకు అంటుకొని అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. కూలీ పనులకు వెళ్తూ తల్లీకొడుకు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

కౌలు రైతులకు రుణాలివ్వడంలో కుంటిసాకులు

పదిశాతం పంట రుణాల లక్ష్యాన్ని పాటించని బ్యాంకులు

ఏలూరు,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): కౌలు రైతులు రాష్ట్రంలో లక్షల్లో ఉండగా ఈ మారు ఖరీఫ్, రబీ కలుపుకొని ఇప్పటి వరకు కేవలం 50 వేల లోపు రైతులకే బ్యాంకులు రుణాలిచ్చాయి. ప్రతి ఏటా వార్షిక రుణ ప్రణాళికలో ప్రతిపాదించిన పంట రుణ లక్ష్యాల్లో పది శాతానికి తక్కువ కాకుండా కౌలు రైతులకు ఇవ్వాలని కొన్నేళ్లుగా చెబుతున్నారు. బ్యాంకులను ఒప్పించి కౌలు రైతులకు రుణాలిప్పిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వగా ఆచరణలో నెరవేరలేదు. దాంతో కౌలు రైతులను, ముఖ్యంగా సిసిఆర్‌సి హోల్డర్లతో ప్రత్యేకంగా జెఎల్‌జిలను వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామాల్లో ఏర్పాటు చేస్తారని, గ్రూపు సమిష్టి బాధ్యతపై బ్యాంకులు రుణాలిస్తాయని ప్రభుత్వం కొత్త పల్లవి ఎత్తుకుంది. జెఎల్‌జిలు, ఆర్ఎంజిలకు బ్యాంకులు రుణాలివ్వక పోవడం వల్లనే 2011లో రుణ అర్హత కార్డుల (ఎల్ఇసి) చట్టం వచ్చింది. దాన్ని టిడిపి సర్కారు నిర్వీర్యం చేయగా, వైసిపి ప్రభుత్వం మొత్తానికే రద్దు చేసి కొత్త చట్టం తెచ్చింది. ఇప్పుడు అది సైతం చెల్లని చట్టంగా తయారైంది. 2020–21 బ్యాంకుల రుణ ప్రణాళికలో ఆ ఆనవాయితీకి గండి కొట్టారు. ఖరీఫ్, రబీ కలుపుకొని మొత్తంగా రూ. 94,629 కోట్ల పంట రుణాలివ్వాల నుకోగా వాటిలో పది శాతం అంటే సుమారు రూ.9, 500 కోట్లు కౌలు రైతులకు కేటాయించాలి. కానీ రూ.6,500 కోట్లు (6.86 శాతం) ప్రతిపాదించారు. ఆ మేరకన్నా అప్పులిచ్చారా అంటే అదీ లేదు. ఖరీఫ్ పూర్తయి, రబీ ముగింపుదశకొచ్చిన స్థితిలో కూడా 49,344 మందికి రూ.495.64 కోట్లిచ్చారు. భూమిని నమ్ముకొని శ్రమించి పంటలు పండిస్తున్న వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు మేలు చేసేందుకంటూ ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన పంట సాగుదారు హక్కు చట్టం కింద జారీ చేసిన సిసిఆర్‌సిలపై అప్పులు పొందిన వారు 41 వేల మంది మాత్రమే! వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం 2020 ఖరీఫ్‌లో రెండున్నర లక్షల కార్డులు జారీ అయ్యాయి. స్పెషల్ డ్రైవ్ వలన ఆ మాత్రమన్నా ఇచ్చారు. కార్డులపై పంట రుణాలివ్వాల్సిన బ్యాంకులు కుంటి సాకులతో కౌలు రైతులను ఇబ్బందులు పెడుతున్నాయి.

ఓడిపోతే సంబరాలు చేసుకుంటారా ?

పంచాయితీ ఎన్నికల్లో 16శాతం కూడా దక్కించుకోలేదు
టిడిపి అధినేతపై ధ్వజమెత్తిన మంత్రి అనిల్ కుమార్ యాదవ్

అమరావతి,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): భారతదేశ చరిత్రలోనే ఓడిపోతే సంబరాలు చేసుకునేది ఒక్క టీడీపీ మాత్రమేనని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. 81 శాతం స్థానాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సాధిస్తే కేవలం 16 శాతం సాధించిన టీడీపీ సంబరాలు జరుపుకోవడం ఏంటని విమర్శించారు. పైగా ప్రతి విడతలో టీడీపీ పుంజుకుంది అని బాబు చెప్పడం మరీ విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన వల్ల రెట్టింపు ఉత్సాహంతో ప్రజలు తమకు విజయాన్ని అందించారన్నారు.

టీడీపీకి వచ్చిన 16 శాతం కూడా వైఎస్సార్‌సీపీ రెబల్స్ వల్ల వచ్చిందని, లేదంటే సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యేదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 41 శాతం స్థానాలు గెలిచామని బాబు అభూత కల్పన చేస్తున్నారని, దమ్ముంటే ఏ జిల్లాలోనైనా మీ వాళ్లకు కండువా వేసి చూపించగలవా? అని సూటిగా ప్రశ్నించారు. చంద్రగిరిలో 104 వైఎస్సార్‌సీపీ గెలిస్తే, 4 టీడీపీ గెలిచింది. నారావారిపల్లెలో కేవలం 8 వార్డులు గెలిచి సంబరాలు చేసుకున్నారు. నీ సొంత ఇలాకాలోనే 20 శాతం సాధించలేని నువ్వు 41 శాతం గెలిచావా..? సర్పంచ్ ఎన్నికలకు 25 ప్రెస్ మీట్‌లు పెట్టిన ఘనుడు చంద్రబాబు. వైఎస్సార్‌సీపీ పతనం అయ్యిందా...? ఎక్కడో చూపించు. కుప్పంలోనే దిక్కు లేదు, అలాంటిది మరో 10శాతం అదనంగా వచ్చేవి అనడానికి సిగ్గులేదా? రానున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు వస్తాయి. టీడీపీ అంపశయ్యపై నుంచి చితిలో పడిపోయింది.

ఏ దిక్కు లేక స్వరూపానందపై పడ్డాడు... క్షుద్రపూజలు అంటాడు. క్షుద్రపూజలపై పేటెంట్ ఒక్క చంద్రబాబుకే ఉంది. దుర్గగుడి, కాళహస్తిలో నీ కొడుకు కోసం క్షుద్రపూజలు చేయించింది నువ్వు. కేపిటల్ జోన్ అంటున్న తాటికొండలో కూడా మేము 70 శాతం గెలుచుకున్నాం. ప్రజలు 81 శాతం సీట్లు ఇచ్చి సీఎం జగన్‌పై నమ్మకాన్ని ఉంచారు.

అందుకు ప్రతి ఒక్కరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నాం. ఇక బూతుల్లో గెలిచి సంబరాలు చేసుకునే స్థాయికి టీడీపీ దిగజారుతుంది. ఈ ప్రతిపక్ష నాయకుడు ప్రతిపక్ష పాత్రకు కూడా పనికిరాడని ప్రజలు తీర్పిచ్చారని అన్నారు. మేము అధికారంలో ఉండటానికి అర్హత లేదని చెప్పే అర్హత చంద్రబాబుకు అసలే లేదు. ఓ పక్క నువ్వు పెట్టిన నిమ్మగడ్డ అంతా బాగా జరిగిందని అంటే నువ్వేమో రావణకాష్ఠం అంటావు. ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగాయి. అయినా ఆడలేక మద్దెల దరువు అన్నట్లు ఉంది చంద్రబాబు తీరు. వాళ్ళు గెలిచిన 16 శాతం చోట్లలో ఎన్నికలు బాగా జరిగినట్లా? 81శాతం గెలిచిన చోట ఎన్నికలు బాగా జరగలేదా? కౌంటింగ్ కేంద్రాల వద్ద కరెంట్ తీయడం కాదు, వాళ్ల కరెంట్ కట్ అయ్యింది ఇంకా చంద్రబాబు ఆలాంటి గొప్ప వారసుడిని పెట్టుకుని అధికారంలోకి వస్తాను అనడం పగటికల. 2024లో కూడా మా ముఖ్యమంత్రి కూల్‌గా ఆ సీట్లో కూర్చుంటారని మంత్రి అనిల్ కుమార్ కరాఖండిగా చెప్పారు.

వాలంటీర్‌లకు ఉగాది రోజున సత్కారం

వారి సేవలను గుర్తించేలా ప్రోత్సాహకాలు
ప్రణాళిక శాఖపై సమీక్షలో నిర్దేశిత లక్ష్యాలు
అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

అమరావతి,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): గ్రామ సచివాలయ వాలంటీర్‌లను ఉగాది రోజున సత్కరించే కార్యక్రమానికి కార్యాచరణ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వాలంటీర్ల సేవలను గుర్తించేలా ప్రోత్సాహకాలతో వారిని గౌరవించాలని పేర్కొన్నారు. సేవారత్న, సేవా మిత్ర.. పేరుతో ఇలా మంచి సేవలను అందించిన వాలంటీర్లను సత్కరించాలన్నారు. ప్రణాళిక శాఖపై తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. నిర్దేశిత లక్ష్యాలపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సచివాలయంలో కూడా డేటా క్రోడీకరణ ఒకరికి అప్పగించాలని పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయా ల్లోని డిజిటల్ అసిస్టెంట్‌కు ఈ బాధ్యతలు అప్పగించాలని, మండల స్థాయిలో ఉన్న ఉద్యోగి దీన్ని సూపర్ వైజ్ చేస్తారని తెలిపారు. అదే విధంగా రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న డేటాను స్వీకరించాలని సీఎం జగన్ పేర్కొన్నారు. ఆర్బీకేల పరిధిలో చేస్తున్న ఇ–క్రాపింగ్ లాంటి డేటాను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. దీనివల్ల ఇ–క్రాపింగ్ జరుగుతుందా? లేదా? అన్నదానిపై దృష్టి పెట్టగలుగుతామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, ఆర్బీకేలు.. ఇలా గ్రామాల్లోని ప్రభుత్వ వ్యవస్థల వద్ద ఇంటర్నెట్ సరిగ్గా పనిచేస్తుందా? లేదా? అన్న డేటా కూడా ఎప్పటికప్పుడు రావాల న్నారు. దీనివల్ల పాలన, పనితీరు సమర్థవ ంతంగా ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. సుస్థిర సమగ్రాభివృద్ధికోసం ఐక్యరాజ్యసమితి నిర్దేశిరచిన 17 లక్ష్యాలను అందుకునేలా రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు ఉన్నాయని అధికారులు సీఎం జగన్‌కు వెల్లడించారు. అయితే ఈ లక్ష్యాలను చేరు కునే క్రమంలో ఐక్యరాజ్యసమితి, దాని అను బంధ విభాగాలు సహా ప్రపంచ స్థాయి సంస్థల భాగస్వామ్యం తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, యునెస్కోలాంటి సంస్థలతో కూడా కలిసి పనిచేయాలని సూచించారు. డేటాను కేవలం సేకరించడమే కాకుండా.. ఆ డేటా ద్వారా తీసుకోవాల్సిన చర్యలమీద కూడా దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. వివిధ కార్యక్రమాల్లో మనం ఎంతవరకూ లక్ష్యాన్ని చేరుకున్నాం, లోపాలేమిటో గుర్తించాలని తెలిపారు. వాటిని ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ సమావేశానికి ప్రణాళికా శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ విజయ్‌కుమార్, కనెక్ట్ టూ ఆంధ్ర సీఈవో వి. కోటేశ్వరమ్మ, ఆర్టీజీఎస్ సీఈవో జే విద్యాసాగర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

యాదాద్రిలో వైభవంగా ఏకాదశి ఉత్సవం

లక్షపుష్పార్చనతో స్వామికి సేవలు

యాదాద్రి,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): లక్ష్మీనృసింహస్వామి స్వామి సన్నిధిలో మంగళవారం భీష్మ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని లక్ష పుష్పార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు సహస్ర నామ పఠనాలతో అర్చక బృందం, వేద పండితులు వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన జరిపారు. సుమారు రెండు గంటల పాటు పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ప్రతీ ఏకాదశి పర్వదినం రోజు స్వయంభూ పంచనారసింహుడు కొలువు దీరిన యాదాద్రి క్షేత్రంలో స్వామిని లక్ష పుష్పాలతో అర్చించడం ఆలయ సంప్రదాయం. కార్యక్రమంలో దేవస్థాన ఉప ప్రధాన అర్చకులు, వేద పండితులు, అర్చక బృందం, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

చంద్రబాబు మారడు.. భ్రమల్లో ఉంచాలని చూస్తాడు

ట్విట్టర్ వేదికగా మరోమారు మండిపడ్డ విజయసాయి

అమరావతి,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడిపై ఎంపీ విజయసాయిరెడ్డి ట్విట్టర్ వేదికగా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. చంద్రబాబు తీరును ఎండగట్టారు. ఎన్నికల ఫలితాలు ఊహించి నట్టుగా రాకపోతే ఓటమిని సమీక్షించుకుంటాం అంటారు ఎవరైనా. నాలుగో విడత 41.7 శాతం ఓట్లు పడ్డాయని సొల్లు మాటలు చెబుతూనే ప్రభుత్వంపై దుమ్మెత్తి పోసాడు చంద్రబాబు. ఇతను మారడు. తను భ్రమల్లో జీవిస్తూ అందరిని అందరినీ అదే భ్రాంతిలో ఉంచాలని చూస్తాడంటూ విజయసాయిరెడ్డి ఎద్దేవా చేశారు. పంచాయతీ తుది దశ పూర్తయ్యే సరికి తుప్పలు పట్టుకుపోయాడు తుప్పు నాయుడు. ఈ నకిలీ నాయుడు ప్రచారం చూసి జనమే గుణపాఠం చెప్పారు. వైఎస్సార్ సీపీ పేరుతో నకిలీ వెబ్‌సైట్ పెట్టి నైజీరియా మోసగాళ్ల ముఠా స్థాయికి దిగజారాడు. మున్సిపల్ ఎన్నికల్లోనూ టీడీపీకి ఇంతకంటే పరాభవం తప్పదంటూ విజయసాయిరెడ్డి మరో ట్వీట్‌లో పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యంత ప్రశాంతంగా పంచాయతీ ఎన్నికలు జరిగాయని ఎలక్షన్ కమిషన్, పోలీసు శాఖలు వెల్లడించాయని ఆయన మరో ట్వీట్ చేశారు. వైఎస్ జగన్ 20 నెలల సంక్షేమ పాలనకు కృతజ్ఞతగా దక్కిన అఖండ విజయం ఇది. టీడీపీ అడ్రసు గల్లంతయి గ్రామాలన్ని వన్ సైడుగా మారడం వల్ల అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా పోయిందని ఎంపీ విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

టూల్‌కిట్ కేసులో దిశరవికి పోలీస్ కస్టడి

ఢిల్లీ హైకోర్టు అనుమతి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 23(ఆర్ఎన్ఎ): 'టూల్‌కిట్' కేసులో ఈనెల 13న బెంగళూరులో అరెస్టు చేసిన పర్యావరణ కార్యకర్త దిశారవికి ఒక రోజు పోలీసు కస్టడీకి ఢిల్లీ హైకోర్టు సోమవారంనాడు అనుమతించింది. జనవరి 26న ట్రాక్టర్ ర్యాలీలో చోటుచేసుకున్న హింసపై పోలీసు దర్యాప్తులో భాగంగా 'టూల్‌కిట్' కేసు వెలుగుచూసింది. దిశా రవి మూడు రోజుల జ్యుడిషియల్ కస్టడీ ముగియడంతో ఆమెను పాటియాల్ హౌస్ కోర్టు చీఫ్ మెట్రోపాలి టలన్ మేజిస్ట్రేట్ డాక్టర్ పంకజ్ శర్మ ముం దు పోలీసులు హాజరుపరిచారు. ఆమెను ఐదు రోజుల పోలీసు కస్టడీకి అనుమతించాలని ఢిల్లీ పోలీసులు కోరారు. ఢిల్లీ పోలీ సుల తరఫున న్యాయవాది వికాస్ తన వాదన వినిపిస్తూ, ఈ కేసులో నికిత, శంతను అనే మరో ఇద్దరు నిందితులు ఉన్నారని, వాళ్లు కూడా విచారణకు హాజరుకావాల్సి ఉందని చెప్పారు. ఈ ఇద్దరికి అరెస్టు చేయకుండా ముంబై హైకోర్టు ముందస్తు రక్షణ కల్పించింది. టూల్‌కిట్ వ్యవహారంలో ఈ ఇద్దరితో కలిపి దిశా రవిని విచారించాల్సి ఉందని కోర్టుకు వికాస్ తెలిపారు. ఢిల్లీ పోలీసుల రిమాండ్ అప్లికేషన్‌ను దిశా రవి తరఫు న్యాయవాది సిద్ధార్థ్ అగర్వాల్ వ్యతిరేకించారు. పోలీసు కస్టడీ మొదటిసారి అన్నట్టుగా పబ్లిక్ ఎ÷–లాసిక్యూటర్ వాదిసున్నారని, గతంలో ఏడు రోజుల కస్టడీ అడిగి ఐదు రోజుల కస్టడీ పొందారని చెప్పారు. దాని గురించి కోర్టుకు వాళ్లు తెలియజేయలేదన్నారు. దానిపై బెయిల్ అప్లికేషన్ పెట్టుకోగా మూడు గంటల పాటు సెషన్స్ కోర్టు విచారణ చేసిందని చెప్పారు. శంతను, నికితలు కస్టడీలో లేనందున తన క్లయింట్‌ను కస్టడీకి అడగడం సరికాదని అగర్వాల్ వాదించారు. దీనికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ అగర్వాల్ స్పందిస్తూ, పోలీసు కస్టడీని పనిష్మెంట్‌గా ఎందుకు అనుకుంటు న్నారని ప్రశ్నించారు. అది విచారణ సంస్థ హక్కు అని వాదించారు. కాగా, దిశా రవి దాఖలు చేసిన బెయిలు దరఖాస్తుపై ఢిల్లీ కోర్టు మంగళవారంనాడు ఆదేశాలు ఇవ్వనుంది. రైతుల నిరసనలపై 'టూల్ కిట్' డాక్యుమెంట్ రూపకల్పనతో పాటు, ప్రచారం చేసిందనే అభియోగాలను దిశారవి ఎదుర్కొంటోంది. ఈ ప్రచారమే జనవరి 26న హింసకు దారితీసిన్నటు పోలీసులు అనుమానిస్తున్నారు.

బెంగాల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారు

బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోడీ
మార్చి మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్ రావచ్చని సూచన

కోల్‌కతా/గౌహతి, ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రజలు మార్పునకు సంసిద్ధంగా ఉన్నారని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. బహిరంగ సభకు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనడమే ఇందుకు తార్కాణమని, ఇది ఢ

దేశాభివృద్ధిలో సెంట్రల్ (జియస్‌టీ) ఎక్సైజ్ శాఖ

(24 ఫిబ్రవరి "సెంట్రల్ ఎక్సైజ్ దినం" సందర్భంగా)

1855లో భారత దేశంలో అతి పురాతన 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్' విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. భారత రెవిన్యూ మరియు ఆర్థిక శాఖ పరిధిలో పని చేస్తున్న సెంట్రల్ ఎక్సైజ్ లేదా సెంట్రల్ జియస్‌టి విభాగం ఎక్సైజ్ డ్యూటీ, సర్వీస్ టాక్స్, కస్టమ్స్ డ్యూటీ, నార్కొటిక్స్ డ్యూటీ, జియస్‌టి లాంటి పన్నులు వసూలు చేయడంతో పాటు మాదకద్రవ్యాల అక్రమ రవాణాను నియంత్రించే అతి ముఖ్యమైన కృషిని చేస్తున్నది. 24 ఫిబ్రవరి 1944న 'సెంట్రల్ ఎక్సైజ్ అండ్ సాల్ట్ చట్టం-1944' ఏర్పడిన సందర్భానికి గుర్తుగా ప్రతి ఏటా 24 ఫిబ్రవరిన దేశవ్యాప్తంగా 'సెంట్రల్ ఎక్సైజ్ డే' నిర్వహిస్తున్నారు. ఈ రోజున సెంట్రల్ ఎక్సైజ్ శాఖ పట్ల సామాన్యులకు అవగాహన కల్పించే క్రమంలో భాగంగా సదస్సులు, కార్యశాలలు, విద్య మరియు సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు మరియు అవార్డుల ప్రదానాలు వంటి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తారు. సెంట్రల్ ఎక్సైజ్ విభాగంలో విధులు నిర్వహించే ఉద్యోగుల సేవలను గుర్తించి, వారిని సన్మానించుకోవలసిన కనీస అవసరం బాధ్యతగల దేశ పౌరుల మీద ఉందని మరువరాదు.

వస్తు ఉత్పత్తి పరిశ్రమల వ్యాపారాల్లో అవినీతిని కట్టడి చేయడం, పారదర్శకత పెంచడం, సత్సాంప్రదాయాలను నెలకొల్పడం మరియు సంబంధిత చట్టాలను పటిష్టంగా అమలు చేయడం అనే గురుతర బాధ్యతలు సెంట్రల్ ఎక్సైజ్ శాఖ ఉద్యోగుల మీద ఉంది. ఈ శాఖలో కస్టమ్స్ అక్ట్-1962, కస్టమ్స్ ట్రాఫిక్ అక్ట్-1975, సెంట్రల్ ఎక్సైజ్ అక్ట్-1944 మరియు సర్వీస్ టాక్స్ అక్ట్ లాంటి చట్టాలను గట్టిగా అమలు చేస్తూ, లంచగొండితనాన్ని నివారించడం సమర్థవంతంగా జరగాలి. ప్రస్తుతం గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ (జియస్‌టి) అమలు 01 జూలై 2017 నుంచి అమలులోకి వచ్చింది. పన్నుల వసూల్లు సమర్థవంతంగా జరిగితేనే పేదరిక నిర్మూలన, విద్య మరియు వైద్యాలకు కేటాయింపులు పెరిగి దేశసమగ్రాభివృద్ధి సాధ్యపడుతుందని నమ్మాలి. ఈ శాఖలో నీతివంతమైన సేవలను అందించిన ఉద్యోగులను సన్మానించుకోవాలి. భారత ప్రభుత్వంలోని అన్ని శాఖలు బాధ్యతగా సేవలందిస్తేనే దేశం అభివృద్ధి పథంలో పయనించి స్వర్ణభారతం సుసాధ్యమవుతుంది.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

అల్లాదుర్గం మండలం ముస్లాపూర్‌లో దుర్ఘటన

కుల బహిష్కరణతో వ్యక్తి ఆత్మహత్య

మెదక్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): కుల బహిష్కరణ చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన యువకుడు గత రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. అల్లాదుర్గం మండలం ముస్లాపూర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ముస్లాపూర్ గ్రామానికి చెందిన ఇప్ప శంకర్ అనే వ్యక్తి ఓ హత్య కేసులో ఆరేళ్ల పాటు జైలు శిక్ష అనుభవించిన అనంతరం.. ఆ కేసును కొట్టివేయడంతో ఇటీవలే జైలు నుంచి విడుదలయ్యాడు. అయితే హత్య కేసులో శంకర్ నిందితుడిగా ఉన్న సమయంలోనే అతని కుటుంబాన్ని కులపెద్దలు కులం నుంచి బహిష్కరించారు. జైలు నుంచి విడుదలైన శంకర్.. తమను కులంలోకి రానివ్వలంటూ కుల పెద్దలను అడిగాడు. కులంలోకి రావాలంటే.. రూ. 3 లక్షలు చెల్లించాలని కులపెద్దలు డిమాండ్ చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శంకర్.. జనవరి 6వ తేదీన అల్లాదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో అతను ఆవేదన చెందాడు. నిన్న రాత్రి సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శంకర్ నివాసంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సంక్షేమంలో తెలంగాణ నంబర్ వన్

బండి సంజయ్ విమర్శలు మాని చర్చకు రావాలి: పల్లా

హైదరాబాద్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): అరేళ్లలో టీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృది సంక్షేమ కార్యక్రమాలను చూసి పట్టభద్ర ఓటర్లు ఎమ్మెల్సీ ఎన్నికల్లోతనను గెలిపించ బోతున్నారని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మూడు జిల్లాల్లో తాను పర్యటించానని, పట్టభద్రులు సిఎం కెసిఆర్, టిఆర్ఎస్‌పై విశ్వాసంతో ఉన్నారని అన్నారు. బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ మాటలను ప్రజలు విశ్వసించడం లేదన్నారు. ఆయన నరెచ్చగొట్టే విధానం నచ్చడం లేదన్నారు. అవాస్తవాలతో అభూత కల్పనలతో బూతులు మాట్లాడే వారికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. లక్ష 31 వేల మంది ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరారు. 2 లక్షలు మంది ఐటి ఉద్యోగాల్లో చేరారు. భారత దేశంలో కేంద్రం, ఇతర రాష్ట్రాల్లో చేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగ కల్పన చేసిందని చెప్పిన పల్లా, దమ్ముంటే నీతి ఉంటే నేను చెప్పిన ఉద్యోగాల కల్పన లెక్కలు తప్పు అని నిరూపించాలని బండి సంజయ్‌కి సవాల్ విసిరారు. నీలా ఇష్టం వచ్చినట్లు మేము తిట్ట దల్చుకుంటే ఆ జడివాన లో మీరు కొట్టుకుపోతార పేర్కొన్నారు. పట్టభద్రుల ఆశలు ఆకాంక్షలు తెలిసిన వాడిగా ఏది ఎప్పుడు చేయాలో అప్పుడు మేము చేసి తీరుతామన్నారు. చాలామంది ప్రశ్నించే గొంతులు అంటూ ముందుకు వస్తున్నారు..కానీ తెలంగాణా రావడంతోనే ఆ ప్రశ్నలకు సగం సమాధానం వచ్చింది. మిగతా ప్రశ్నలను సీఎం సమాధాన పరుస్తున్నారు అని రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

సింగరేణిని నిలువునా దోచుకుంటున్న కెసిఆర్ కుటుంబం

సింగరేణిలో కవిత అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది
సిఎండి శ్రీధర్ అక్రమాలకు అండగా నిలిచారు
సిబిఐ విచారణ చేయించి అక్రమాలను వెలికి తీస్తామన్న తరుణ్ చుగ్
సింగరేణి ఆస్తులను కెసిఆర్ దోచుకుంటున్నారన్న బండి సంజయ్
కాగజ్‌నగర్‌లో పార్టీలో చేరిన పాల్వాయి హరీష్

పెద్దపల్లి,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): కోట్ల రూపాయల ఆదాయం గల సింగరేణిని ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం దోచుకుంటోందని బీజేపీ ఇన్‌ఛార్జ్ తరుణ్‌చుగ్ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. సింగరేణిలో పెత్తనం చలాయిస్తూ అధికారులను చెప్పుచేతల్లో పెట్టుకున్నారని అన్నారు. ఎమ్మెల్సీ కవిత సింగరేణిలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. సింగరేణి అక్రమాలపై సీబీఐ విచారణ జరిపిస్తామని తరుణ్‌చుగ్ పేర్కొన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా శ్రీ రాంపూర్‌లో పర్యటించిన ఆయన.. అక్కడి కార్మికులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్, కవితపై విమర్శలు గుప్పించారు. సింగరేణికి కవిత యూనియన్ లీడర్‌గా మారి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్మికులు, కార్మిక నేతలపై ఆధిపత్యం చేలాయిస్తున్నారని మండిపడ్డారు. సింగరేణి అవినీతికి అడ్డాగా మారిందన్నారు. సింగరేణిలో అవినీతిని చూస్తూ ఊరుకోమన్నారు. సింగరేణి సీఎండీ సరిగా పనిచేయడం లేదని,టీఆర్ఎస్ ఏజెంట్‌గా పనిచేస్తున్నారని విమర్శించారు. కాగా తెలంగాణలో విస్తరించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోన్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగానే ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో కలిసి తరుణ్‌చుగ్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నారు. అధికార పార్టీయే లక్ష్యంగా పెట్టుకుని విమర్శలు సందిస్తున్నారు. కుమ్రంభీమ్ జిల్లా కాగజ్‌నగర్‌లో నిర్వహించిన చత్రపతి శివాజీ సంకల్ప సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఆ పార్టీ తెలంగాణ ఇంచార్జ్ తరుణ్ చుగ్ హాజరయ్యారు. వీరి సమక్షంలో సిర్పూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ పాల్వాయి హరీష్ బాబు పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి కమలం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సంజయ్ ఆయనకు బీజేపీ కండువా కప్పి పాల్వాయి హరీష్ బాబు, అయన అనుచరులను పార్టీలోకి అహ్వానించారు. ఈ సభకు పాల్వాయి అభిమానులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తరుణ్ చుగ్ మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నాయకత్వంలో బీజేపీ పార్టీ తెలంగాణలో రోజురోజుకు బలపడుతోందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం నేరస్తులకు కొమ్ము కాస్తుందని విమర్శించారు. టీఆర్ఎస్ పాలనలో నేరస్తులు నేరం చేసి స్వేచ్ఛగా సమాజంలో నలుమూలల తిరుగుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలో రాక్షస పాలన సాగుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీసులు... ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేల ఒత్తిళ్లకు తలవంచి నేరస్తులను కాపాడుతున్నరని ఆరోపించారు. రాక్షస పాలన నుండి త్వరలోనే తెలంగాణ ప్రజలకు బీజేపీ విముక్తి కలిగిస్తుందని తరుణ్ చుగ్ తెలిపారు. టీఆర్ఎస్‌కు ఫైనాన్స్ సోర్స్‌గా సింగరేణి మారిందని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. సింగరేణి సొమ్మును కేసిఆర్ అక్రమంగా వాడుకుంటున్నా డన్నారు. సింగరేణి సీఎండీ శ్రీధర్ అవినీతి మీద విచారణ జరపించి జైలుకు పంపిస్తామన్నారు.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నదని గుర్తుంచుకోవాలన్నారు. కేసీఆర్ సింగరేణి సంస్థను దోచుకుంటున్నారన్నారు. టీఆర్ఎస్ పార్టీ మాటింగులకు, కేసీఆర్ మందుకు, సోడా, చికెన్ స్టఫ్ కు కూడా సింగరేణి పైసలే పెడుతున్నా రన్నారు. గత ఎన్నికల్లో సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. సింగరేణి సిఎండి.. కేసీఆర్ చెప్పుచేతుల్లో పనిచేస్తున్నాడని. ఐఎఎస్ కాదు అయ్యా ఎస్ అంటున్నారన్నారు. సింగరేణిలో దోచుకున్న సొమ్మును కక్కిస్తామని? వచ్చే ఎన్నికల్లో సింగరేణి గడ్డపై కాషాయ జెండా ఎగురేస్తామన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారిస్తామన్నారు. పాల్వాయ్ పురుషోత్తం వారసుడిగా ఆయన తనయుడు హరీష్ పార్టీలో చేరారని అన్నారు. ఆయనకు స్వాగతం పలుకుతున్నామని అన్నారు. పోరాటాల పురిగిగడ్డ ఆదిలాబాద్ అన్నారు. త్వరలో జరిగే నాగార్జునసాగర్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలని బీజేపీ నేత వివేక్ అన్నారు. ఇక్కడ జరిగిన బీజేపీ సభలో ఆయన మాట్లాడారు. పోతిరెడ్డిపాడు, సంగమేశ్వర్ ప్రాజెక్టుతో జగన్ జల దోపిడీ చేస్తుంటే, కేసీఆర్ ఫామ్‌హౌజ్‌లో పడుకుంటున్నాడని వివేక్ విమర్శించారు. ప్రాజెక్టుల పేరుతో నిధులను ఆంధ్రా కాంట్రాక్టర్లకు, మేఘా కృష్ణారెడ్డికి ఇస్తున్నాడని వివేక్ ఆరోపించారు. పేద ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వడం లేదని, కానీ కొడుకు, బిడ్డలకు ఫామ్‌హౌజ్‌లు కట్టిస్తున్నాడని ఆయన ఆరోపించారు. సాగర్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలని ఆయన పేర్కొన్నారు. పోలీస్ వ్యవస్థకు గులాబీ కండువా వేశారని, పోలీస్ విలువలను దిగజార్చారని ఆయన విమర్శించారు. ఈ కారణంగానే అడ్వకేట్ దంపతుల హత్య జరిగిందని వివేక్ ఆరోపించారు. కేసీఆర్, టీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయం బీజేపీనే అన్నారు. తరుణ్ చుగ్ నేతృత్వంలో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. ప్రాణహిత చేవెళ్లను కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టుగా మార్చారన్నారు. ఏపీ 60 టీఎంసీల నీళ్లు దోచుకుంటున్నా నోరు మెదపడం లేదన్నారు. రాష్ట్ర నిధులన్నీ మేఘా కంపెనీకి దోచిపెడుతున్నాడన్నారు. దేశంలో అవినీతిలో నెంబర్ వన్ సీఎం కేసీఆర్..అని అన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారన్నారు. దుబ్బాక, జిహెచ్ఎంసి తరహాలోనే నాగార్జున సాగర్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్ ను ఓడించి కేసీఆర్ చెంప చెల్లు మనిపించాలని అన్నారు. పోలీస్ వ్యవస్థను పూర్తిగా కూల్చేసిన ఘనత కేసీఆర్ దేనన్నారు. కాగజ్ నగర్ సభకు భారీగా ప్రజలు తరలివచ్చారు.

అంబులెన్స్ బహుకరించిన నాటా

లక్సెట్టిపేట్,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్(నాటా) ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ గుండ అమర్‌నాథ్ దాతృత్వంతో అధ్యక్షుడు డాక్టర్ గోసుల రాఘవరెడ్డి తెలంగాణ ప్రభుత్వానికి అంబులెన్స్ బహూకరించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పాల్గొన్నారు. నాటా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ లక్షలాది మందికి చేయూత అందిస్తోంది. 'సాంస్కృతిక వికాసమే నాటా మాట.. సమాజ సేవయే నాటా బాట' అనే లక్ష్యంతో అమెరికాలో పలు కార్యక్రమానలు నిర్వహిస్తూ తెలుగు సంస్కృతిని కాపాడుతోంది. అదేవిధంగా పలు హెల్త్ క్యాంప్స్, బస్సు షెల్టర్లు, వీధి దీపాలు, అనాథాశ్రయాలు, వృద్ధాశ్రమాలకు సహాయం చేస్తూ గత పదేళ్లుగా ఎంతో సమాజ సేవ చేస్తూ అమెరికాలో ముందు వరసలో ఉంటోంది. ఈ అంబులెన్సు బహూకరణ కు సహకరించిన దాతలను, అందరినీ సమన్వయం చేసిన గుండ అమర్‌నాథ్‌ను నాటా అధ్యక్షులు డాక్టర్ గోనల రాఘవరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజలు కోరుకునేది ప్రశ్నలు కాదు..పరిష్కారాలు : మంత్రి సత్యవతి రాథోడ్

నల్లగొండ, ఫిబ్రవరి 23: ప్రజలు కోరుకునేది వారి సమస్యలను పరిష్కరించే ప్రజా ప్రతినిధులను గానీ, ప్రశ్నించే వారిని కాదని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ టీఆర్ఎస్ అభ్యర్థిగా పల్లా రాజేశ్వర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా చేపట్టిన నామినేషన్ ర్యాలీలో మంత్రి సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పల్లా రాజేశ్వర్ రెడ్డి సీఎం కేసీఆర్‌కు సన్నిహితులు. ప్రజల సమస్యలను దగ్గరుండి పరిష్కరించడంలో చిత్తశుద్ధి ఉన్న నేత కాబట్టి పల్లా రాజేశ్వర్ రెడ్డిని ఎమ్మెల్సీగా భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

కొంతమంది అభ్యర్థులు మేం ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం. గెలిపించండి అని కోరుతున్నారు. ప్రజలకు కావల్సింది వారి సమస్యలను పరిష్కరించే వారుగానీ, ప్రశ్నించే వారు కాదన్నారు.

గిరిజన బిడ్డలు చైతన్యవంతులు, విద్యావంతులు, పోరాట పటిమ కలిగిన వారు కాబట్టి పల్లా రాజేశ్వర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసిన 10 శాతం రిజర్వేషన్లను పక్కన పెట్టి, 20 ఏళ్ల కింద తీసుకొచ్చిన జీవో 3ని సుప్రీం కోర్టు రద్దు చేస్తే దానిమీద గిరిజనుల పక్షాన మాట్లాడని బీజేపీ నేతలకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు.

ఇక వందేళ్ల భవనం కాలంతీరి ఎలాగైతే కూలిపోతుందో అలాగే సూరేళ్ల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా అలాగే కూలిపోతుందన్నారు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ ఎమ్మెల్సీగా ఇక్కడ కనీసం ఆ పార్టీకి అభ్యర్థి దొరకక ఎక్కడి నుంచో తీసుకొచ్చిన వారిని పెట్టుకోవడమేనన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, అజయ్ కుమార్, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, సైదిరెడ్డి, ధర్మారెడ్డి, రాజయ్య, శంకర్ నాయక్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

నర్సింగాపూర్ గ్రామంలో టిఆర్ఎస్ సభ్యత్వ నమోదు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 23: (నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలో టిఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని టిఆర్ఎస్ చందుర్తి మండల శాఖ అధ్యక్షులు మరాఠీ మల్లిక్ మంగళవారం ప్రారంభించారు, సింగిల్విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్ తో కలిసి సభ్యత్వ నమోదును ప్రారంభించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని పలువురు యువకులు,కులసంఘాల పెద్దలు, రైతులు, మహిళలు స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు, పార్టీ సభ్యత్వం తీసుకుని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాపల్లి గంగాధర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దప్పుల అశోక్,నాయకులు బైరగోని రమేష్ గౌడ్,

సంపునూరి దేవగౌడ్, బొడిగె లస్మయ్య , మల్యాల మహేశ్, చింతకుంట సత్తయ్య, ముత్యాల నరేశ్, గుర్రం దేవయ్య,యువనాయకులు బండి శ్రావణ్ కుమార్, సంపునూరి మురళీగౌడ్, బండి దేవరాజ్,ఓరుగంటి రాజు,కుంట ప్రతాప్, పర్కారములు,దొబ్బల ప్రవీణ్,ఎర్రం శంకరయ్య లోలపు వైకుంఠం, దయ్యాల దేవయ్య,అన్వర్ పాషా, కొలకాని నరేశ్, మురళి, తోకల శంకర్ తదితరులు పాల్గొన్నారు,

తరగతుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి : సీఎస్

హైదరాబాద్, ఫిబ్రవరి23: రాష్ట్రంలో 6 నుంచి 8వ తరగతి చదివే విద్యార్థులకు రేపటి నుంచి తరగతులు ప్రారంభించే ందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సీఎస్ సోమేశ్ కుమార్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్లు, డీఈఓలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. 6,7,8వ తరగతి విదార్థులకు తరగతులు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో పలు అంశాలపై అధికారులతో ఆయన చర్చించారు.

రేపటి నుంచి మార్చి 1వ తేదీలోగా పాఠశాలల నిర్వాహకులు తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో విద్యా పర్యవేక్షక కమిటీలు సమావేశం కావాలని సూచించారు. కొవిడ్ నేపథ్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల భద్రత కోసం అన్ని చర్యలు చేపట్టాలన్నారు.

ఎపి సర్కార్ మరో కీలక నిర్ణయం

ఇబిసి మహిళలకు ఏటా 15వేల సాయం
రూ.670 కోట్లతో ఈబీసీ నేస్తం పథకం
నవరత్నాల అమలునకు క్యాలెండర్
వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయింపు
బడ్జెట్ సమావేశాలపైనా చర్చ
వివరాలు వెల్లడించిన మంత్రి పేర్ని నాని

అమరావతి,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): అగ్రవర్ణ పేదలకు ఎపి ప్రభుత్వం తీపి కబురు అందించింది. వీరి సంక్షేమం కోసం కొత్త పథకాన్ని తీసుకురాబోతున్నట్టు మంత్రి పేర్నినాని తెలిపారు. ఏపీ కేబినెట్ భేటీ ముగిసిన అనంతరం మీడియాతో నాని వివరాలు వెల్లడించారు. రూ.670 కోట్లతో ఈబీసీ నేస్తం పథకానికి కేబినెట్ ఆమోదముద్ర వేసిందని పేర్నినాని తెలిపారు. 45-60 ఏళ్ల ఈబీసీ మహిళలకు మూడేళ్లపాటు ఏటా రూ.15 వేల ఆర్థిక సాయం అందుతున్నారు. నవరత్నాల అమలు క్యాలెండర్‌కు కూడా కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. 23 రకాల సంక్షేమ పథకాలకు నెలవారీగా షెడ్యూల్ ప్రకటించారు. 5.69 కోట్ల మంది పేదలకు క్యాలెండర్ ప్రకారం పథకాలు అమల చేయనున్నట్టు తెలిపారు. జగనన్న విద్యా దీవెనలో సంపూర్ణంగా బోధనా ఫీజు చెల్లింపులు ఉంటాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యంగా సంక్షేమ పథకాల అమలుపైనే ఏపీ కేబినెట్ ప్రధానంగా చర్చించింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో అమలు చేయనున్న సంక్షేమ పథకాలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సంక్షేమ పథకాల కేలండర్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపడమే కాకుండా కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. వైఎస్ఆర్ చేయూత, కాపునేస్తం, నేతన్న నేస్తం మాదిరిగా మరో కీలక పథకాన్ని రంగంలోకి దించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు మహిళలకు అందిస్తున్న పథకాన్ని ఈబీసీ మహిళలకూ వర్తింపజేయాలని నిర్ణయించింది. ఈమేరకు ఈబీసీ నేస్తం పథకానికి మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. వచ్చే మూడేళ్లలో ఒక్కో మహిళా లబ్దిదారుకు ఈసీబీ నేస్తం పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేలు చొప్పున రూ.45 వేల ఆర్థిక సాయం అందించనుంది. వచ్చే బడ్జెట్లోనే ఈ పథకానికి సంబంధించిన కేటాయింపులను కూడా జరపాలని మంత్రివర్గం నిర్ణయించింది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు కూడా త్వరలోనే విడుదల కాబోతున్నాయి. ఇక కేబినెట్ సమావేశంలో మరికొన్ని కీలక అంశాలను ఆమోదించింది. అమరావతి రాజధానిలో అసంపూర్తిగా ఉన్న భవనాల పైనా చర్చ జరిగింది. రాజధాని పరిధిలోని భవనాలను పూర్తి చేసేందుకు అమరావతి రీజియన్ డెవలప్ మెంట్ అథారిటికీ రూ.3వేల బ్యాంక్ గ్యారెంటీ ఇచ్చేందుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక కాకినాడ సెజ్ భూముల వ్యవహారంలో రైతులకు నష్టపరిహారం చెల్లించే అంశాన్ని ఆమోదించింది. నష్టపరిహారంపై కమిటీ సూచనల కంటే ఎక్కువే చెల్లించాలని నిర్ణయించింది. అలాగే సెజ్ పరిధిలోని ఆరు గ్రామాలను తరలించా లనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. అలాగే కడపలో నిర్మించనున్న వైఎస్ఆర్ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం భాగస్వామ్య సంస్థకు ఆమోదం తెలిపింది. దీంతో పాటే కడప జిల్లాలో రెండు ఇండస్ట్రియల్ పార్కులకు భూ కేటాయింపులపై చర్చించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు, విశాఖ స్టీల్ ప్లాంట్ పోరాటం, టిడ్కో ఇళ్ల కేయాయింపు, పంచాయతీ ఎన్నికల ఫలితాలు, మున్సిపల్ ఎన్నికల వంటి కీలక అంశాలు కేబినెట్ దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది.

పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం ఖాయం

నల్లగొండ, ఫిబ్రవరి23: పెద్ద ఎత్తున తరలివచ్చిన గ్రాడ్యుయేట్ ఓటర్లు, నాయకులు, కార్యకర్తలను చూస్తుంటే ఎమ్మెల్సీగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం ఖాయం అయిందని మంత్రులు జగదీష్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు.

ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న మంత్రి జగదీష్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో గ్రాడ్యుయేట్ స్థానాన్ని కైవసం చేసుకుంటామన్నారు.

పెద్ద ఎత్తున అందరూ తరలివచ్చి భారీ ర్యాలీ నిర్వహించి పల్లా రాజేశ్వర్ రెడ్డిని ఆశీర్వదించారు అందరికి ధన్యవాదాలు అన్నారు.

తెలంగాణకు సీఎం కేసీఆర్ శ్రీరామరక్ష. ప్రజల బాధలు తెలిసిన వ్యక్తి కేసీఆర్. ప్రతిపక్షాలను ప్రజలు చిదరించుకుంటున్నారు. అబద్దాలు, అవాస్తవాలు ప్రచారం చేయడమే ప్రతిపక్షాలు పనిగా పెట్టుకున్నాయన్నారు. సీఎం కేసీఆర్ ఈ ఆరున్నర ఏళ్లలో లక్ష ముప్పై వేల ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించారన్నారు.

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. ఏ దేశంలో ఇవ్వని విధంగా లక్ష ముప్పై వేల ప్రభుత్వ ఉద్యోగాలను రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఇచ్చారన్నారు. ఈ విషయాన్ని గ్రాడ్యుయేట్ ఓటర్లు అర్థం చేసుకోవాలన్నారు. కాళేశ్వరం జలాలతో తెలంగాణ ససస్యశ్యాలం ఎలా అయిందో యోచించాలన్నారు. అబద్దాలు, కల్పనలు బీజేపీ నైజం అన్నారు. మభ్యపెట్టి పబ్బం గడుపుకుంటున్నట్లు దుయ్యబట్టారు.

మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ రద్దు చేయాలి

హైకోర్టులో పిటిషన్ దాఖలు

అమరావతి, ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలపై హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఎన్నికల నోటిఫికేషన్ రద్దు చేయాలని న్యాయవాదులు పిటిషన్‌లో కోరారు. పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. మార్చి 10న పురపాలిక ఎన్